
అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రవీంద్ర

మావోయిస్టుల అరెస్టుతో ఉమ్మడి కృష్ణాజిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా 32 మంది ఒకే చోట పట్టుబడ్డారు. కానూరు న్యూ ఆటోనగర్, రామవరప్పాడులో 20 రోజులుగా తలదాచుకుంటున్నారు. పక్కా సమాచారంతో ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగి పట్టుకున్నాయి. విషయం బయటకురావడంతో బెజవాడ వాసులు భయాందోళనకు గురయ్యారు. మావోయిస్టు ఉద్యమంతో నాటి తరం నాయకులకు ఉన్న సంబంధాలు, వెలుగు చూసిన ఘటనలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు షెల్టర్ జోన్‌లో జరిగిన వాటిలో ఇదే మేజర్ ఆపరేషన్‌గా భావిస్తున్నారు.


న్యూ ఆటోనగర్‌లో మావోయిస్టులు అద్దెకు దిగిన భవనం


మావోయిస్టులు ఉన్న భవనంలోకి ప్రవేశిస్తున్న ప్రత్యేక బలగాలు


ఆ భవనం వైపు ఎవరూ వెళ్లకుండా భద్రతా ఏర్పాట్లు

షెల్టర్ జోన్‌లో.. మేజర్ ఆపరేషన్!

విజయవాడ సమీపంలోని కానూరులో సంచలన ఘటన

న్యూ ఆటోనగర్, రామవరప్పాడులో 32 మంది మావోయిస్టుల పట్టివేత

- సుమారు 20 రోజులుగా ఓ భవనంలో ఉంటున్నట్టు సమాచారం
- గతంలో ఒకరిద్దరిని పట్టుకున్నా.. ఆధారాలు లేక వదిలేసిన పోలీసులు
- **2006లో ఆటోనగర్‌లో రాకెట్ లాంచర్ల పట్టివేతతో ఉలిక్కిపడిన బెజవాడ**
- **అదే ఏడాది రాకెట్ లాంచర్లు, డిటోనేటర్లు, జిలెటిన్ స్టిక్స్ అనేక సార్లు దిగుమతి**
- మావోయిస్టు ఉద్యమంలో నాడు కీలకపాత్ర పోషించిన జిల్లా వాసులు

(ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం/విజయవాడ): షెల్టర్ జోన్‌గా ఉన్న ఉమ్మడి కృష్ణాజిల్లాలో మావోయిస్టులను పట్టుకోవడంలో జరిగిన అతి పెద్ద ఆపరేషన్‌గా మంగళవారం నాటి ఘటన నిలిచింది. కానూరు ఆటోనగర్ అనేది బెజవాడ ఆటోనగర్‌ను ఆనుకుని ఉంటుంది. విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డులో జీ ప్లస్ 3 భవనంలో తలదాచుకున్న 28 మంది, రామవరప్పాడులో నలుగురు మావోయిస్టుల ను గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు అరెస్టు చేయటం సంచలనంగా మారింది. గతంలో ఇంత పెద్ద సంఖ్యలో విజయవాడలో కానీ, ఉమ్మడి కృష్ణాజిల్లాలో కానీ మావోయిస్టులను పట్టుకున్న ఉదంతాలు లేవు. విజయవాడ నగరాన్ని మావోయిస్టులు కొన్ని దశాబ్దాల కాలంగా షెల్టర్‌జోన్‌గా ఎంపిక చేసుకున్నారు. ఇక్కడి నుంచి ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించిన దాఖలాలు లేవు కానీ, షెల్టర్‌గా మాత్రం ఉపయోగించు మిగతా 6లో..


ఘటనాస్థలంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


డాగ్ స్క్వాడ్‌తో..


మీడియా ప్రతినిధుల కోలాహలం

భయం గుప్పెట్లో న్యూ ఆటోనగర్

విజయవాడ/కానూరు /పెనమలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు పట్టుబడటంతో పాత, కొత్త ఆటోనగర్ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆటోనగర్, కానూరు న్యూ ఆటోనగర్ వరకు అనేక పరిశ్రమలు ఉన్నాయి. సుమారు 20 వేల యూనిట్లు ఆటోనగర్‌లోనే ఉండడంతో స్థానికులు, బయట ప్రాం తాలకు చెందిన సుమారు లక్షమంది ఇక్కడి ప్రతి రోజు ఉపాధి పొందుతారు. రెసిడెన్షియల్, ఇండస్ట్రీస్ ప్రాంతంగా గుర్తింపు పొందడంతో పాటు పారిశ్రామిక వేత్తలు కూడా ఇక్కడే ఉంటారు. ఇలాంటి ప్రాంతంలో మావోయిస్టులు 20 రోజులుగా ఇక్కడే ఉన్నారు. వారిని మంగళవారం గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు అరెస్ట్ చేయడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. అసలు మావోయిస్టులు ఇక్కడ ఎందుకు ఉన్నారు? ఎన్ని రోజులు ఉండాలనుకున్నారు? ఎవరు, ఏ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ఉంటున్నారనే సందేహాలు స్థానికుల్లో తలెత్తుతున్నాయి. ఇన్ని రోజులు వారు ఇక్కడే తలదాచుకుంటున్నా పోలీసులు ఎందుకు గుర్తించలేకపోయారనే అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు.

అమ్మో.. ఆటోనగర్!
• ఉలిక్కిపడిన శివారు ప్రాంతాలు
6
అప్రమత్తమైన అధికారులు
• నగరం నలుమూలలా తనిఖీలు
6
ప్రశ్నార్థకంగా భద్రత
• కొత్త ఆటోనగర్‌పై నిఘా నామమాత్రం

త్వరలో మూడు షిప్పింగ్ హార్బర్ల ఏర్పాటు

విశాఖ సీఐఐ సదస్సులో కుదిరిన ఒప్పందాలు

పోర్టు సమీపంలో కేటాయించనున్న 400 ఎకరాలు : మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం సముద్ర తీరంలో మూడు షిప్పింగ్ హార్బర్ల ఏర్పాటుకు విశాఖలో ఇటీవల జరిగిన సీఐఐ సదస్సులో ఒప్పందాలు కుదిరాయని, వీటికి పోర్టు సమీపంలో 400 ఎకరాలు కేటాయిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ బందరును బంగారు బందరుగా చేస్తున్నామన్నారు. గోవా, ఢిల్లీ నుంచి మూడు షిప్పింగ్ హార్బర్ల ఏర్పాటుకు ఒప్పందాలు కుదిరాయన్నారు. గ్రీన్‌కో సంస్థ అధినేత చలమలశెట్టి అనిల్ రూ.4వేల కోట్లతో మచిలీపట్నంలో కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ముందుకు వచ్చారని తెలిపారు. పోర్టు నిర్మిస్తున్న మెగా ఇంజనీరింగ్ కంపెనీ మచిలీపట్నం సముద్ర తీరాన డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ నిర్మాణాలు జరిగితే మచిలీపట్నం అభివృద్ధి గణనీయంగా ఉంటుందన్నారు. వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని చెప్పారు. వైసీపీ నాయకులు రోడ్ల అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. కాగా, ముస్లింల అజ్మీర్ యాత్రకు ఎంపీ బాలశౌరితో కలిసి ప్రత్యేక రైలును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మచిలీపట్నంలో రూ.60 కోట్లతో డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. వీటితో పాటు మరో రూ. 13 కోట్లు కావాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.

చరిత్ర మరువని జలప్రళయం
• దివిసీమ ఉప్పెనకు 48 ఏళ్లు
8
అనాదిగా షెల్టర్ జోన్ బెజవాడ
• రాకపోకలు సాగిస్తున్న మావోయిస్టులు

మీడియాతో మాట్లాడుతున్న రైల్వే ఎస్పీ రత్నరాజు



రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్టు

నిందితులు తెనాలి, డోన్ వాసులుగా గుర్తింపు

రూ.6 లక్షలు విలువైన 26 సెల్‌ఫోన్లు స్వాధీనం

గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.6 లక్షలు విలువైన 26 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో విజయవాడ రైల్వే ఎస్పీ జి.రత్నరాజు కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. మచిలీపట్నం-ధర్మవరం రైలులో తమ సెల్‌ఫోన్‌లు చోరీకి గురైనట్లు రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందాయి. రైల్వే డీఐజీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. గుడివాడలోని సీసీ కెమెరాల పరిశీలన ద్వారా వచ్చిన సమాచారం మేరకు ఏరియా ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న తెనాలికి చెందిన ధర్మవరం రైలుబండిలో బెడ్ రోలర్ షేక్ కరీముల్లా, అనంతపురం జిల్లా, డోన్‌కు చెందిన ఆంథోని చిన్నప్పలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6 లక్షలు విలువైన 26 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి.దుర్గారావు, ఎస్ఐ మహబూబ్ షరీఫ్, ఏఎస్ఐ షేక్ అక్బర్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్, ఎస్ఐ పి.రామకృష్ణను ఉన్నతాధికారులు అభినందించారు.

మినుముల పోత మిషన్‌లో పడి మహిళా కూలీ దుర్మరణం


షేక్ ఖాసీం బీ (ఫైల్)

తోట్లవల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కూలి పనికి వెళ్లి మినుముల పోత మిషన్‌లో పడి మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలేనికి చెందిన క్రాంతి అనే వ్యక్తి మినుముల పోత మిషన్‌తో పాటు గ్రామానికి చెందిన మహిళా కూలీలను మంగళవారం ఉదయం గుంటూరు జిల్లా వల్లభాపురానికి తీసుకెళ్లాడు. మినుము పంటను పోత మిషన్‌లో వేసే క్రమంలో షేక్ ఖాసీం బీ(39) ఒక్కసారిగా మిషన్‌లో చిక్కుకుపోయింది. మిషన్‌లో పడి శరీరమంతా నుజ్జునుజ్జయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. అయితే ఖాసీం బీ మృతదేహాన్ని ట్రాక్టర్‌పై వేసుకుని కృష్ణాజిల్లాకు తీసుకువచ్చి ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. ఘటన జరిగింది గుంటూరు జిల్లాలో కాబట్టి అక్కడికే మృతదేహాన్ని తీసుకెళ్లాలని వైద్యులు వెనక్కి పంపినట్టు సమాచారం. దాంతో మృతదేహాన్ని మళ్లీ గుంటూరు జిల్లాకు తరలించినట్టు తెలిసింది. ఖాసీం బీ భర్త ఇస్మాయిల్ తాపీ పని చేస్తుంటాడు. మృతురాలికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉదయమే పొట్టకూటి కోసం వెళ్లిన ఖాసీం బీ మరణ వార్త వల్లూరుపాలెంలో విషాదం నింపింది.

ఏడుగురు ఎస్సైల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మచిలీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎస్సై కేవై దాస్‌ను చల్లపల్లి స్టేషన్‌కు, చల్లపల్లిలో పనిచేస్తున్న ఎస్సై పీఎస్‌వీ సుబ్రహ్మణ్యంను ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇనుగుదురుపేట ఎస్సై యార్లగడ్డ వీవీ సత్యనారాయణను ఏలూరు జిల్లా పెదవేగిలోని డీటీసీ సెంటరుకు బదిలీచేశారు. కోడూరులో పనిచేస్తున్న పి.శిరిషను కూచిపూడి పోలీస్ స్టేషన్‌కు, అవనిగడ్డలో ఎస్సై-2గా పనిచేస్తున్న వై.వెంకటసత్యనారాయణను గుడివాడ-2 టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. గుడివాడ వన్‌టౌన్ ఎస్సై పి.గౌతమ్‌కుమార్‌ను అవనిగడ్డకు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎస్సై కె.నాగవిశ్వనాథ్‌ను మచిలీపట్నంలోని డీసీఆర్‌బీ విభాగానికి బదిలీ చేశారు.

అమ్మో.. ఆటోనగర్!

ఉలిక్కిపడిన శివారు ప్రాంతాలు

- అభయారణ్యం నుంచి.. జనావాసాల్లోకి మావోయిస్టులు
- కానూరు న్యూ ఆటోనగర్‌లో కొద్దిరోజులుగా మకాం!
- వలస కార్మికులకు ఆవాసంగా ఉండటంతో ఎంపిక
- ఇతర రాష్ట్రాల నుంచి హైర్ చేసుకుంటున్న యాజమాన్యాలు
- ఇక్కడే కార్మికులకు వసతి, భోజనం ఏర్పాట్లు
- పారిశ్రామిక వాడ కావటంతో పోలీసుల నిఘా తక్కువ

అభయారణ్యంలో ఉండే మావోయిస్టులు అడవిని విడిచి గుట్టుచప్పుడుగా జనావాసాల్లోకి అడుగుపెట్టడం తీవ్ర సంచలనంగా మారింది. అమరావతి రాజధాని చెంతన మావోయిస్టుల ఉనికిని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర బలగాలు పకడ్బందీగా ఆపరేషన్ నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో నగరం ఉలిక్కిపడింది.



కానూరు న్యూ ఆటోనగర్‌లో మావోయిస్టులు తలదాచుకున్న భవనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడలోని కానూరు న్యూ ఆటోనగర్‌ను మావోయిస్టులు వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. వీరిలో సింహభాగం చత్తీస్‌ఘడ్‌కు చెందినవారేనని పోలీసువర్గాలు చెబుతున్నాయి. చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఎంతోమంది వలస కార్మికులు ఆటోనగర్, కొత్త ఆటోనగర్లలో పనిచేస్తున్నారు. బీహార్, కలకత్తాల నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడ పనిచేస్తున్నారు. దీనిని మావోయిస్టులు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో వచ్చి ఇక్కడ పనిచేస్తుంటారు కాబట్టి ఎవరికీ అనుమానం కూడా రాలేదు. స్థానికంగా ఉండే లేబర్.. ఆటోనగర్లలో పనిచేయటానికి భారీ ఎత్తున రోజుకు రూ.2 కూలి డిమాండ్ చేస్తుండటంతో పరిశ్రమల యాజమానులు కూడా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. చత్తీస్‌ఘడ్, బీహార్, కలకత్తాల నుంచి వచ్చిన వారికి రోజుకు రూ. 500లు ఇస్తే సరిపోతుంది. కొంతమంది పెద్ద పారిశ్రామిక యాజమాన్యాలు అయితే గంపగుత్తగా ఆయా రాష్ట్రాల నుంచి కార్మికులను తెచ్చుకుని వారికి కొత్త ఆటోనగర్‌లోనే ఆవాసం కల్పిస్తున్నాయి. వారికి భోజనాలు, అల్పాహారాల వంటి బాధ్యతలను కూడా యాజమాన్యాలు తీసుకుంటున్నాయి. పరిశ్రమల చెంతనే ఉన్న భవనాలలో కార్మికులను ఉంచుతున్నారు. మావోయిస్టుల్లో సింహభాగం చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ వంటి మిగిలిన రాష్ట్రాల వాళ్లు ఉండటంతో వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. కొత్త ఆటోనగర్‌లోని విద్యుత్‌సబ్‌స్టేషన్ రోడ్డుకు ఆరో అంతర్గత రోడ్డుగా ఉన్న జీప్లస్+3 భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. భవన యజమాని అప్పలస్వామినాయుడు విజయవాడలో ప్రముఖ ఆర్కిటెక్ట్. ఆయన కొంతకాలంగా జర్మనీలో ఉంటున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మూడు ఫ్లోర్లు ఖాళీగా ఉన్నాయి. మావోయిస్టులు మూడో ఫ్లోర్‌ను అద్దెకు తీసుకున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి తరహా భవనాలు అనేకం ఉన్నాయి. ఇతర రాష్ట్రాల వారంతా ఇదే తరహాలో ఉంటారు. ఎవరికీ అనుమానం ఉండదు. దీంతో తెలివిగా ఈ ప్రాంతాన్ని ముందుగా అధ్యయనం చేసిన తర్వాతే ఎంపిక చేసుకున్నట్టుగా తెలుస్తోంది. పెద్దగా పోలీసు నిఘా కూడా ఈ ప్రాంతాలపై ఉండదు. దీంతో కానూరు ఆటోనగర్ ప్రాంతాన్ని మావోయిస్టులు ఎంచుకోవటం గమనార్హం. విజయవాడలో జవహర్ ఆటోనగర్ విస్తరణ కాకపోవటం వల్ల కానూరులో కొత్త ఆటోనగర్ ఏర్పడింది. కానూరులో ఆటోనగర్ ఏర్పాటుకు 1995లో శ్రీకారం చుట్టడం జరిగింది. 1999లో కానూరు ఆటోనగర్‌లో ప్లాట్లు కేటాయించారు. మొత్తం 300 పైబడి ప్లాట్లు ఉన్నాయి. చిన్న, మధ్య తరహాతో పాటు భారీ యూనిట్లు కూడా కొత్త ఆటోనగర్‌లో ఉన్నాయి. కానూరు ఆటోనగర్ ఏర్పడి దాదాపుగా 26 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి కాలేదు. ప్రధాన రోడ్లు తప్పితే అంతర్గత రోడ్లన్నీ కూడా మట్టి రోడ్లే కావటం గమనార్హం. రోడ్లు కూడా ఎగుడు దిగుడులుగా ఉంటాయి. దీంతో ఈ ప్రాంతాలలోకి స్థానిక యూనిట్లతో అవసరం ఉన్నవారు తప్పితే మిగిలిన వారు ఇటు రారు. నిర్మానుష్యంగా ఉంటున్న ప్రాంతం కావటంతో ఇక్కడ కొంత కాలం తలదాచుకోవచ్చని మావోయిస్టులు ఎంపిక చేసుకున్నారు. అభయారణ్యాలను వదిలి జనారణ్యంలోకి వచ్చి మారుమూల ప్రాంతాలను ఎంచుకునే క్రమంలో కానూరు ఆటోనగర్‌ను ఎంచుకున్నారు.



ఆటోనగర్‌లో పోలీసు బలగాలు

హాట్ టాపిక్‌గా మావోల అరెస్టు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ /కానూరు/పెనమలూరు)

మావోయిస్టుల కదలికల నేపథ్యంలో విజయవాడ నగరం, శివారు ప్రాంతాలు అట్టుడికాయి.. చిన్న, మధ్య తరహాపరిశ్రమలు, నిరుపేదలు ఉండే కొత్తఆటోనగర్‌లో మావోయిస్టులు తలదాచుకుంటున్నారనే వార్త గుప్పుమనడంతో నగర ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కూడళ్లలో మావోయిస్టుల ఉదంతం సంభాషణే వినిపిస్తోంది. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు, కుటుంబ కలహాలు, చోరీలు, అగ్ని, రోడ్డు ప్రమాదాలు అరకొరగా హత్యలు మాత్రమే ఇప్పటి వరకు చోటు చేసుకున్నాయి. అయితే ఇటీవల కాలంలో క్రైం రేటు కొంత వరకు అదుపులోకి వచ్చింది. విధ్వంస ఘటనలకు తావులేని ఈ ప్రాంతంలో మావోయిస్టులు తలదాచుకుంటున్నారనే విషయం బహిర్గతం కావడం ప్రజలను ఒకింత భయాందోళనకు గురి చేసింది.

ప్రశాంత ప్రాంతం.. మావోల స్థావరం

విజయవాడ నగరంతో పోల్చితే నగర శివారులోని కానూరు, తాడిగడప, ఎనికేపాడు, నిడమానూరు, పోరంకి ప్రాంతాలు ప్రశాంతంగా ఉంటాయి. ఇక్కడ క్రైం రేటు కూడా తక్కువగానే ఉంటుంది. రైతులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు అత్యధికంగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటారు. గడిచిన దశాబ్ద కాలంలో ఈ ప్రాంతాల్లో అత్యధికంగా విద్యా సంస్థలు స్థాపించబడ్డాయి. ఇక్కడే తాడిగడప 100 అడుగుల రోడ్డులో కొత్తగా ఆటోనగర్ ఏర్పాటు జరిగింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉంటాయి. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు మాత్రమే ఆ ప్రాంతంలో ఉంటారు. ఎలాంటి అసాంఘిక ఘటనలు జరగని ప్రదేశం కావడంతో పోలీసులు సైతం అటు వైపు కన్నెత్తైనా చూడరు. ఈ నేపథ్యంలోనే మావోలు కొత్తఆటోనగర్‌ను స్థావరంగా ఎంచుకోవటంతో ఒక్కసారిగా ఈ ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కంగుతిన్న ప్రజలు

పనినిమిత్తం ఉదయమే కంపెనీలకు వచ్చిన వారు గుంపు గుంపులుగా ఉన్న పోలీసులను చూసి ఖంగుతిన్నారు. ముందుగా ఈ ప్రాంతంలో దొంగలు ఉన్నారని, పట్టుకునేందుకు వచ్చామని పోలీసులు తమతో చెప్పినట్టు పలువురు పేర్కొన్నారు. మావోలు ఉన్న భవనం రోడ్డు, ఈ భవనానికి నాలుగు దిక్కుల్లో ఉన్న రోడ్లలోని పరిశ్రమల్లోకి కూలీలను పోలీసులు అనుమతించలేదు. అయితే ఆ భవనంలో ఉన్నది మావోయిస్టులని ఉదయం 10 గంటల ప్రాంతంలో ప్రజలకు పూర్తి స్థాయిలో తెలిసి భయాందోళనకు గురయ్యామని పలువురు కార్మికులు తెలిపారు. నక్సలైట్లు పోలీసులపై ఎదురు కాల్పులు జరుపుతారనే భయం ప్రజలను వెంటాడింది. దీంతో పలువురు కార్మికులు పనివదిలేసి వెళ్లిపోయారు. మావోల వార్తతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఇంకా ఏఏ ప్రదేశాల్లో ఉన్నారో.. అనే అనుమానం ప్రజలను తాజాగా వెంటాడుతోంది.



భవనం వెలుపల కేంద్ర సాయుధ బలగాలు

అప్రమత్తమైన అధికారులు

నగరం నలుమూలలా తనిఖీలు

ప్రముఖులు, రాజకీయ నాయకుల అలర్ట్

విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మావోయిస్టుల కదలికల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం న్యూ ఆటోనగర్ లోని ఒక భవనంలో 28 మంది మావోయిస్టులను గ్రే హౌండ్స్, ఆక్టోపస్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఉమ్మడి కృష్ణా జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా విజయవాడలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీచేస్తున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి వ్యక్తిని ప్రశ్నిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా నగరంలో ఇంతమంది మావోయిస్టుల కదలికలతో రాజకీయ నాయకుల్లోను భయాందోళ మొదలైంది. రాజకీయ నాయకులు, ప్రముఖులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రిమోట్ ప్రాంతానికి వెళ్లే నాయకులకు అదనపు భద్రత కేటాయించారు. 15 రోజులుగా మావోయిస్టులు నగరంలోనే ఉండడంతో వారి కదలికలపై ఆరా తీస్తున్నారు. ఈ 15 రోజుల్లో వారు ఎక్కడెక్కడ తిరిగారు, ఎవరెవరిని కలిశారనే విషయాలను తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



మావోల అరెస్టుతో షాక్‌లో.. స్థానికులు!

పెనమలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేయడంతో స్థానికంగా ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఇరవై రోజులుగా తమ మధ్య ఇంతమంది మావోయిస్టులు ఆయుధాలతో ఆశ్రయం పొందారన్న విషయం తెలియగానే ఆటోనగర్‌లో కార్మికులు, పరిశ్రమల యజమానులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. జనసమ్మర్ద ప్రాంతంలో ఆశ్రయం పొందారంటే నమ్మశక్యం కావడం లేదని పలువురు వ్యాఖ్యానించారు.

నమ్మలేకపోతున్నాం



- రమణ, వ్యవసాయ ఉత్పత్తుల యంత్రాల తయారీ కంపెనీ ఓనర్

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఆశ్రయం పొందారని వినగానే మొదట మేము నమ్మలేదు. ఆటోనగర్‌కు పనుల నిమిత్తం వివిధ రాష్ట్రాల నుండి వర్కర్లు వస్తుంటారు. వారిలో ఎవరు నేరస్థులో, ఎవరు మావోయిస్టులో మాకు తెలియడం లేదు. పోలీసులు నిఘా పెంచాలి.

ఎప్పుడు ఆశ్రయం పొందారో తెలియదు



- రవిచంద్ర, ఫ్యాబ్రికేటర్

ఆటోనగర్‌లో మావోయిస్టులు ఆశ్రయం పొందారన్న విషయం పోలీసులు వచ్చేంత వరకు స్థానికులకు తెలియదు. తెలియగానే నమ్మలేకపోయాం. అడ్డరోడ్డులో వారు ఉంటున్న భవనం చాలా రోజులుగా ఖాళీగా ఉండేది. స్థానికంగా ఎవరు ఎక్కడి నుండి వచ్చిపోతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. దీంతో మావోయిస్టులు ఉన్నారా అన్న అనుమానం కూడా రాలేదు.

ఎవరికీ వారి కదలికలు అర్థం కాలేదు



-ఎలక్ట్రికల్ షాపు ఓనర్ సురేష్

పొద్దుకూకిన వెంటనే కార్మికులు ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోతారు. దీంతో ప్రత్యేకంగా ఆటోనగర్‌లో సంచరించేవారు ఎవరు ఎక్కడి వారో పట్టించుకున్న నాధుడు లేడు.

కారులో టీ, క్యారేజీలలో ఆహారం వచ్చేది



- జయప్రసాద్, సెక్యూరిటీ గార్డు, లక్ష్మిచైతన్య మౌల్డింగ్ కంపెనీ

ప్రతి రోజూ ఒక కారులో ఉదయం కెటిల్‌లో టీ, పెద్ద పెద్ద క్యారేజీలలో భోజనం రావడం చాలా సార్లు చూశాను. మాకు అనుమానం వచ్చి కారులో క్యారేజీలు తెచ్చే వారిని అడగ్గా దూర ప్రాంతం నుండి కూలి పనుల నిమిత్తం కూలీలు వచ్చి ఆశ్రయం పొందారని చెప్పారు.

(5వ పేజీ తరువాయి)

కుంటున్నారు. మావోయిస్టుల సానుభూతి పరులన్న అనుమానాలతో పూర్వం అరెస్టులు జరిగినా ఆ తర్వాత సహేతుక ఆధారాలు లేక వారిని వదిలేయటం జరిగింది. పూర్వపు రోజుల్లో నక్సల్స్ కదలికలు మాత్రం గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఉండేవి. ప్రధానంగా నక్సల్స్ తమ సాహిత్యాన్ని గ్రామాల్లో ఉన్న అభ్యుదయవాదులకు అందించటం జరిగేది. అభ్యుదయవాదులు ఈ సాహిత్యాన్ని అధ్యయనం చేయటం ద్వారా ప్రజలకు తెలియజేసేవారు. అప్పట్లో ఇప్పుడున్నంత దృష్టి పోలీసులకు ఉండేది కాదు. దీంతో నక్సల్స్ తమ కార్యక్రమాలను చాపకిందనీరులా చేసుకుంటూ పోయేవారు.

షెల్టర్ జోన్‌లో.. మేజర్ ఆపరేషన్!

నాడు ఉలిక్కిపడిన బెజవాడ

2006-07 మధ్య కాలంలో ఓ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వాహనంలో విజయవాడకు వచ్చిన రాకెట్ లాంచర్ల విడిభాగాలను పోలీసులు పట్టుకున్నారు. విజయవాడకు ట్రాన్స్‌పోర్ట్ చేసిన రాకెట్ లాంచర్లు ఓ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ గోడౌన్‌లో దిగుమతి అయ్యాయి. అయినా వాటిని తీసుకోవటానికి కొద్ది రోజులు ఎవరూ రాలేదు. ఈ సమాచారం పోలీసులకు తెలియటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత కానీ అవి రాకెట్ లాంచర్ల విడిభాగాలని బయట ప్రపంచానికి తెలిసింది. ఈ పరిణామంతో విజయవాడ నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇదే సందర్భంలో మహబూబ్‌నగర్, ప్రకాశంజిల్లాలో రాకెట్ లాంచర్ల డంప్‌లను పోలీసులు సీజ్ చేశారు. దీంతో విజయవాడకు ఓ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపిన రాకెట్ లాంచర్ల విడిభాగాలను తీసుకువెళ్లటానికి మావోయిస్టులు జాప్యం చేశారు. ఈ లోపే సమాచారం బయటకు రావటంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్, ప్రకాశం జిల్లాల్లో దొరికిన రాకెట్ లాంచర్లు కూడా విజయవాడకు ముందుగా రవాణా అయ్యాయని అప్పట్లో పోలీస్ వర్గాలు నిర్ధారించాయి. 2006లో చెన్నై నుంచి దిగుమతి చేసుకున్న రాకెట్ లాంచర్ల విడిభాగాలను పొద్దుటూరుకు చేర్చి అక్కడి నుంచి అచ్చంపేట గిద్దలూరులలో ఎంపిక చేసిన ప్రాంతాలకు మావోయిస్టులు తరలించారు. ఆయా ప్రాంతాల్లో సీజ్ చేసిన వాటిలో భారీ సంఖ్యలో రాకెట్ లాంచర్ల విడిభాగాలతో పాటు జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, ఇతర పేలుడు పదార్థాలు ఉన్నాయి. ఇవి కనుక వారి చేతికి చేరి ఉంటే భారీ స్థాయిలో మారణహోమాలు జరిగి ఉండేదని తెలిసింది. అదృష్టవశాత్తూ విజయవాడతో సహా, విజయవాడ నుంచి బయట ప్రాంతాలకు రవాణా అయినవన్నీ కూడా అన్నల చేతికి వెళ్లేలోపే పోలీసులు పట్టుకుని సీజ్ చేయటంతో అత్యాధునిక సాంకేతిక ఆయుధాలు, పేలుడు పదార్థాలు మావోయిస్టులకు చేరకుండా నిరోధించటం జరిగింది.

కొండపల్లి సీతారామయ్య అంటే అభిమానంతో..

నాటి నక్సలైట్ ఉద్యమ అగ్రనాయకుడు కొండపల్లి సీతారామయ్య గుడివాడ సమీపంలోని జనార్ధనపురానికి చెందిన వ్యక్తి కావడంతో ఆయన ద్వారా సాయం పొందిన వారు, ఉన్నతస్థితికి ఎదిగినవారు ఆయన అనుచరులుగా ఉండి నేరుగా ఉద్యమంలో పాల్గొనకపోయినా సానుభూతిపరులుగా ఉండేవారు. మావోయిస్టులు ఇబ్బందికర పరిస్థితుల్లో చిక్కుకున్నపుడు విజయవాడ, గుడ్లవల్లేరు, ఘంటసాల, గూడూరు, కోడూరు, తదిత ప్రాంతాల్లో కొద్దిరోజులపాటు తలదాచుకునేవారు. మావోయిస్టు వ్యవస్థను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి తుదముట్టిస్తామని కేంద్రప్రభుత్వం తరచూ ప్రకటనలు చేస్తుండటం, ఇటీవల కాలంలో మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచడం, దొరికిన వారిని దొరికినట్లుగా ఎన్‌కౌంటర్ చేస్తుండటంతో మావోయిస్టులు కృష్ణాజిల్లాకు తరలివచ్చారనే ప్రచారం జరుగుతోంది.

గతంలో చల్లపల్లి శ్రీనివాసరావుపై నిఘా

మావోయిస్టు ఉద్యమానికి అనుబంధంగా కోడూరుకు చెందిన చల్లపల్లి శ్రీనివాసరావు దివిసీమను కేంద్రంగా చేసుకుని జనశక్తి పేరుతో ఉద్యమాలు నడిపేవారు. ఆయనను 20 ఏళ్లక్రితం ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బలగాలు పెనమలూరు, ఉయ్యూరు సరిహద్దులో పట్టుకున్నాయి. ఆయనను మచిలీపట్నంలోని జనశక్తినగర్‌కు తీసుకువచ్చి మావోయిస్టుల సాహిత్యం, తుపాకీ తదితరాలు ఆయన వద్ద ఉంచి ఎన్‌కౌంటర్ చేసేంతగా పోలీసులు హడావిడి చేశారు. ఆ తర్వాత వేర్వేరు కారణాలతో ఆయనను ఎన్‌కౌంటర్ చేయకుండా అరెస్ట్ చేశారు. జైలు నుంచి విడుదలైన అనంతరం ఆయన వృద్ధాప్యంతో మృతి చెందారు.

గత డిసెంబరులో ఐదుగుళ్లపల్లివాసి ఎన్‌కౌంటర్

గూడూరు మండలం ఐదుగుళ్లపల్లికి చెందిన పృథ్వీ మోహనరావు అలియాస్ కార్తీక్‌దాదా(65) ఒడిశా రాష్ట్ర మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఆయన గత ఏడాది డిసెంబరు 11వ తేదీన ఒడిశాలోని నారాయణపూర్ జిల్లా కుమ్మంలోని లక్‌వేద వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఆయన మృతదేహాన్ని ఐదుగుళ్లపల్లికి బంధువులు తీసుకువచ్చి అంత్యక్రియలు పూర్తిచేశారు.

కొత్త ఆటోనగర్‌లో భద్రత ఎంత?

- పోలీసు నిఘా నామమాత్రం
- వెలుగుచూస్తున్న భద్రతా వైఫల్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కొత్త ఆటోనగర్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. నగర శివారున ఉండే.. కొత్త ఆటోనగర్ పారిశ్రామికంగా విస్తరిస్తోంది. నిర్మానుష్యంగా, ప్రశాంతంగా ఉండే కానూరు ఆటోనగర్‌లో కొద్ది రోజుల కిందట గంజాయి గోడౌన్‌ను నిర్వహించటంతో పాటు రవాణా కార్యకలాపాలతో సంచలనమైంది. ఈ ఘటనతో కానూరు ఆటోనగర్ ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. ఇది జరిగి వారం కాక ముందే.. మావోయిస్టుల అడ్డాగా కానూరు ఆటోనగర్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పోలీసు నిఘా తక్కువగా ఉండే ఈ ప్రాంతం అత్యంత ప్రమాదకరశక్తులకు అడ్డాగా మారటంతో ఆందోళన వ్యక్తమౌతోంది. కానూరు, ఆటోనగర్ భద్రత దిశగా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక్కడ వందలాది సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు వీరితో సమస్యలు లేకపోయినా.. వీరి ముసుగులో ఇతర రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులు మకాం వేయటంతో.. ఎవరెవరు ఇక్కడ ఉంటున్నారన్నది అంచనా లేకుండా పోయింది. కొత్త ఆటోనగర్, ఆటోనగర్‌లలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిని పనుల్లోకి తీసుకునే విషయంలో, వారికి ఆశ్రయం కల్పించే విషయంలో కానీ ఒక విధానం లేకుండా పోయింది. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో, కానూరు ఆటోనగర్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకు కానీ, స్థానికంగా కానీ పూర్తిగా వాకబు చేసిన తర్వాతే వారిని విధుల్లోకి తీసుకునే విధంగా ఐలా వంటి సంస్థలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విజయవాడ నగరాన్ని సీసీ కెమెరాలతో జల్లెడపడుతున్న పోలీసు యంత్రాంగాలు ఇలాంటి ప్రాంతాలను వదిలేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతాలపై పోలీసులు పెద్దగా దృష్టిసారించకపోవటంతో.. నేరస్థులు, సంఘవిద్రోహ శక్తులు, మావోయిస్టుల కదలికలు సహజంగానే ఉంటాయి. పారిశ్రామికవాడల రాకపోకలపై కూడా నిఘా పెంచటానికి వీలుగా ప్రధాన మార్గాలు, ఇతర మార్గాలు, అంతర్గత మార్గాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు పోలీసులు కార్డన్ సెర్చ్‌ల సెర్చ్‌ల ద్వారా పరిశ్రమలలో ఎవరెవరు ఉంటున్నారు? గోడౌన్ల మాటున ఏం జరుగుతోంది? ఇతర రాష్ట్రాల కూలీలకు ఆశ్రయం ఇస్తున్న గృహాలు, వారి కదలికలు అన్నవి తెలుస్తాయి. మావోయిస్టుల ఉదంతం నేపథ్యంలో పారిశ్రామికవాడలపై పోలీసులు సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



చికిత్స పొందుతున్న సవర డానియేల్, ఎస్.నరేష్, ధ్వంసమైన బస్సు

బస్సు ప్రమాద బాధితులకు

ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

బస్టేషన్/ప్రభుత్వాసుపత్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలోని అనాసాగరం ఫ్లైఓవర్‌పై మంగళవారం తెల్లవారు జామున జరిగిన బస్సు ప్రమాదంలో క్షతగాత్రులు ముగ్గురు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒడిసాకు చెందిన మహిళకు రెండు కాళ్లు విరిగిపోగా, విజయనగరానికి చెందిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 23 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి శ్రీకాకుళానికి వెళుతున్న కావేరి ట్రావెల్స్ బస్సు సోమవారం అర్ధరాత్రి అనాసాగరం ఫ్లైఓవర్‌పై వద్ద షుగర్‌లోడ్ లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొంది. ఈ ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న నందిగామ పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ముద్దన దాసం (38) కుమారుడితో కలిసి హైదరాబాద్‌లో ఉన్న సోదరి వద్దకు వెళ్లి వస్తోంది. ఆమెకు రెండు కాళ్లు విరగ్గా.. కుమారుడికి స్వల్పంగా గాయాలయ్యాయి. విజయనగరం జిల్లా కొత్తూరు మండలం పెద్దగూడ ప్రాంతానికి చెందిన ఎస్.నరేష్ (35), సవర డానియేల్ (20) హైదరాబాద్‌లో కూలి పనుల నిమిత్తం వెళ్లారు. పనులు లేకపోవటంతో డానియేల్, నరేష్, మరో ఆరుగురు సొంతూరుకు బయలుదేరారు. డానియేల్‌కు తీవ్రగాయాలు కాగా, నరేష్, మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి.

భవానీ భక్తులకు అమ్మ దర్శనం కల్పిద్దాం


- ఆరు లక్షల మంది భవానీలు వస్తారని అంచనా
- ఏర్పాట్లపై కలెక్టర్, సీపీ సమీక్ష

ఇంద్రకీలాద్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాలధారణతో భవానీ దీక్షలను స్వీకరించి నియమనిష్టలతో 41 రోజుల పాటు పూజలు చేసి కనకదుర్గమ్మ దర్శనానికి తరలివచ్చే భవానీ భక్తులు సంతృప్తి చెందేలా అమ్మవారి దర్శనభాగ్యం కల్పిద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబులు అధికారులకు సూచించారు. డిసెంబరు 11 నుంచి 15 వరకు దుర్గగుడిలో జరగనున్న భవానీ దీక్షల విరమణ కార్యక్రమంపై మంగళవారం కలెక్టర్, సీపీలు సమన్వయ శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిసెంబరు 11 నుంచి 15 వరకు భవానీ దీక్షల విరమణలు జరుగుతాయన్నారు. గతేడాది దీక్షల విరమణకు 3.20 లక్షలమంది భవానీలు అమ్మ దర్శనానికి తరలివచ్చారని తెలిపారు. ఈ ఏడాది ఆరులక్షలకుపైగా భవానీ భక్తులు తరలివస్తారని అంచనా ఉందన్నారు. చివరి రెండు రోజుల్లో 1.50 లక్షల వరకు భవానీ భక్తులు రానున్న దృష్ట్యా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు 36 సెక్టార్లను ఏర్పాటుచేసి ఒక్కో సెక్టార్‌కు ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందన్నారు. ఈ ఏడాది 10 వేలమందికి పైగా భక్తులు కలశ జ్యోతులను సమర్పిస్తారని ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సీపీ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సెక్టార్ అధికారులను సమన్వయం చేసుకొని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో 300లకు పైగా సీసీటీవీలను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. ఆలయ ఈవో వీకే శీనానాయక్ మాట్లాడుతూ, దసరా ఉత్సవాల తరహాలోనే భవానీ దీక్షా విరమణలను విజయవంతం చేసేందుకు ప్రణాళికాయుత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జేసీ ఎస్.ఇలక్కియా, అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ జి.రామకృష్ణ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఈఈలు కె.కోటేశ్వరరావు, పి.రాంబాబు, సహాయ ఇంజనీర్లు, పర్యవేక్షకులు, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మత్స్యశాఖ వీఎంసీ, సమాచార తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

దుర్గమ్మ సన్నిధిలో మంత్రి నిమ్మల



కనకదుర్గమ్మను మంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో శీనానాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణలు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. మంత్రి దంపతులు ఆలయంలో జరిగిన పంచహారతి సేవలో రుసుము చెల్లించి పాల్గొన్నారు.

కారులో ఆహారం పంపిస్తున్నదెవరు?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కొత్త ఆటోనగర్‌లో జీ ప్లస్ త్రీ భవనంలో తలదాచుకుంటున్న మావోయిస్టులు బయటకు రావటం చూడలేదని అదే రోడ్డులోని స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా ఉదయం, మధ్యాహ్నం వేళలో ఓ తెల్లటి కారు రావటంతో సమీపంలోని ఓ మౌల్డింగ్ కంపెనీ యజమాని గమనించారు. దీంతో ఆ కారు ఎందుకు వస్తుందో తెలుసుకోమని తమ కంపెనీ సెక్యూరిటీ గార్డుకు చెప్పడంతో సెక్యూరిటీ గార్డు కారులో ఇద్దరు వ్యక్తులతో ఆహారం ఎవరికి తీసుకు వెళుతున్నారని అడగ్గా.. తమ కంపెనీలో పనిచేసే కూలీలు ఈ భవనంలో వసతి కల్పించామని, వారికి ఆహారం ఇస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఇలా కార్లలో యజమానులు తమ యూనిట్లలో పనిచేసే వారికి ఆహారాన్ని పంపిస్తారు. షిఫ్టుల వారీగా పనిచేసేవారు ఉంటారు కాబట్టి వాళ్లు ఉంటున్న ప్రాంతాలకు ఆహారం పంపుతారు. ఈ ప్రాంతంలో మామూలే కాబట్టి.. ఆ సెక్యూరిటీ అలాగా అని వెళ్లిపోయాడు. సెక్యూరిటీ గార్డును పెద్దగా కారులో ఉన్న సిబ్బంది పట్టించుకోలేదు. తర్వాత సెక్యూరిటీ గార్డుకు అనుమానం వచ్చింది. ఆహారం తీసుకుని వెళుతున్నారే తప్ప.. పై నుంచి పనులకు వెళ్లటానికి ఎవరూ దిగిరావటం లేదని గమనించాడు. అనుమానం వచ్చినా కారులో వారిని ప్రశ్నించలేదు. 'ఆంధ్రజ్యోతి' స్థానికులను ప్రశ్నిస్తున్న క్రమంలో సెక్యూరిటీ తాను గమనించిన విషయాలను చెప్పాడు.

మహిళా సానుభూతి పరురాలు ఎవరు?

కానూరు ఆటోనగర్‌లో తలదాచుకుంటున్న మావోయిస్టులకు విజయవాడ నగరానికి చెందిన ఓ మహిళా సానుభూతిపరురాలు సహాయం చేసినట్టు తెలుస్తోంది. ఆ మహిళను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టుల ఆశ్రయానికి ఆమె సహకరించారని తెలుస్తోంది. చత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులకు తెలుగుభాష తెలియదు. అలాంటిది వీరు కొత్త ఆటోనగర్‌లో ఆశ్రయం పొందటానికి ఇల్లు తీసుకోవటం అసాధ్యం. పనులు కోసం వచ్చినట్టుగా కొత్త ఆటోనగర్‌లో తిరుగాడుతూ స్థానికంగా ఉన్న కొందరు చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కార్మికులతో మాటలు కలిపి ఖాళీగా ఉంటున్న భవనాన్ని గుర్తించినట్టుగా ప్రచారం జరుగుతున్నా.. బెజవాడకు చెందిన మహిళా సానుభూతిపరురాలే ఈ భవనాన్ని వాచ్‌మెన్ ద్వారా తాత్కాలికంగా అద్దెకు ఇచ్చినట్టుగా పోలీసులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై బుధవారం పోలీసులు మరింత స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. ఆహారం కూడా ఆ మహిళా సానుభూతిపరురాలే పంపిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రెక్కీకి వచ్చారా..!

మావోయిస్టులు ఇక్కడ తాత్కాలికంగా కొద్దిరోజులు ఉండి.. సేఫ్ ప్లేస్‌లకు వెళ్లిపోవాలన్న ఆలోచనలు చేస్తుండవచ్చన్న అనుమానాలను కూడా పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. అలా అని రెక్కీ నిర్వహించటానికి కూడా అవకాశం లేకపోలేదని చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 650

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరికీడు, కానుమోలు, దంటగుంట్ల, ఎస్.ఎన్.పాలెం గ్రామాల్లో బుధవారం ఉదయం 8గంటల నుండి 12గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



కోటేశ్వరరావుకు బొకే అందజేస్తున్న దివ్యాంగుల అసోసియేషన్ నాయకులు

దివ్యాంగులకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్యాక్‌లాగ్ పోస్టుల్లో దివ్యాంగులకు అధిక ప్రాధాన్యతనివ్వాలని దివ్యాంగుల అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు బూదాటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావును దివ్యాంగుల అసోసియేషన్ నాయకులు మంగళవారం కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం 2026లో దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి ప్రక్రియను ప్రారంభించిందని చదువుకున్న దివ్యాంగులందరికి న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు గుర్తించి , బ్యాక్ లాగ్ పోస్టులు విడుదల చేయాలని కోరారు. కార్యదర్శి పచ్చిగళ్ల భాస్కర్, వెంకటేశ్వరావు, రంగారావు, కరుణాకర్, రాజశేఖర్, అనిల్, అంకాలు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో స్వమిత్వ సర్వే పూర్తి

హనుమాన్‌జంక్షన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వమిత్వ సర్వేలో భాగంగా మండలంలో నాలుగు గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వమిత్వ సర్వే ద్వారా గ్రామంలోని ఇళ్లు, ఖాళీ ఇళ్లస్థలాలు సర్వే చేసి యాజమాన్య హక్కులను కల్పించనుందన్నారు. తిప్పనగుంట, వెంకట్రాజుగూడెం, చిరివాడ, దంటగుంట్ల గ్రామాల్లో సర్వే పూర్తి చేశామన్నారు. పూర్తి చేసిన గ్రామాల్లో సర్వే పై అభ్యంతరాలను కోరుతు యజమానులకు 9(2) నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో అభ్యంతరాలను స్వీకరించడానికి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకం

● చందు జోసఫ్ సుందరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో పాటు అంతర పంటల వల్ల రైతుకు తక్కువ ఖర్చుతో లాభదాయకంగా ఉంటుందని, దీనికి గాను ప్రభుత్వం పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తోందని మండల ఉద్యానవనశాఖ అధికారి చందు జోసఫ్‌సుందరం తెలిపారు. మల్లవల్లి, రంగన్నగూడెం గ్రామాల్లో మంగళవారం పతంజలి ఫుడ్స్, ఉద్యానవన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ తోటల సాగు, నిర్వహణ, ప్రభుత్వ సహకారం అంశాలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయిల్‌పామ్ మొక్కలకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీ ఇవ్వడంతో పాటు నిర్వహణ నిమిత్తం హెక్టారుకు రూ. 5250 చొప్పున 4సంవత్సరాలు అందిస్తోందన్నారు. చీడపీడల సమస్య తక్కువగా ఉన్న ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటలుగా కోకో, అరటి, లాంటి వాటిని సాగుచేయడం వల్ల రైతు కు తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. యంత్రపరికరాలకు, చిన్నట్రాక్టర్ కొనుగోలుకు 50 శాతం సబ్సిడీ అందిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు నేరుగా గెలలను ఫ్యాక్టరీకి తోలేందుకు సమయాభావం లేకుండా ఆయా గ్రామాలకు దగ్గరలోనే కలెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేసి రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తున్నామని పతంజలి ఫుడ్స్ మేనేజర్ పొట్లూరి ప్రసాద్ వివరించారు.అక్కినేని ధర్మరాజు, గుంటకనేని రఘుబాబు, బసంత్‌శంకర్, సత్యన్నారాయణ, పరమేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి చందు జోసఫ్‌సుందరం

జనగణనతో పాటు కులగణన చేపట్టాలి

●కాట్రగడ్డ రామచంద్రజోషి

గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు కులగణన చేపట్టాలని సీపీఐ టౌన్ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్రజోషి పేర్కొన్నారు. సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు భవానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రజోషి మాట్లాడుతూ బీజేపీ 11ఏళ్ల పాలనలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. దేశంలో మతోన్మాద పాలన కొనసాగుతుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో భారత రాజ్యాంగం నడుస్తుందన్నారు. రాష్ట్రంలో 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని తెలిపారు. జనాభా లెక్కలతో పాటు కులగణన చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కామల ఉమామహేశ్వరరావు, కట్టవరపు విజయరావు, నూతక్కి రామ్మోహనరావు, చాగంటిపాటి వెంకటేశ్వరరావు, మోహనరావు, నాగేశ్వరరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దారు భవానికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

● డాక్టర్ చిన నరసింహులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్(ఉంగుటూరు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయసహకారాలను అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ చిననరసింహులు సూచించారు. వేంపాడులో పశుసంవర్ధకశాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పశు గర్భకోశ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు కొలుసు రవీంద్రబాబు, సర్పంచ్ నాగబోయిన శివనాగేశ్వరరావు ప్రారంభించారు. వైద్య శిబిరంలో 95పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. పాడిపరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం లింగనిర్ధారిత వీర్యాన్ని అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా పాల ఉత్పత్తి పెంపొందించి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ చంద్రమోహన్, సహాయసంచాలకులు డాక్టర్ బాలకృష్ణ, ఇందుపల్లి పశువైద్యులు డాక్టర్ సుధీర్‌బాబు, డాక్టర్ వాణి, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న డాక్టర్ చిననరసింహులు

బ్రాహ్మణ సంక్షేమం, అభివృద్దే కూటమి ధ్యేయం

● పి.వి. ఫణికుమార్

ఉయ్యూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ పనిచేస్తుందని కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.వి. ఫణికుమార్ అన్నారు. స్థానిక వైష్ణవాలయ ఆవరణలో మంగళవారం బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు బాపిరాజు ఆధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో నిర్వీర్యమైన బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలను పునరుద్ధరించి నిరుపేద బ్రాహ్మణులకు అండగా నిలవడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో చనిపోయిన నిరుపేద బ్రాహ్మణులకు మట్టి ఖర్చుల రూ. 10వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ ఉద్యోగులకు వ్యక్తిగత రుణాలు, తనాఖా రుణాలు కార్పొరేషన్ ద్వారా ఇవ్వనున్నామన్నారు. ఈ సందర్భంగా ఫణికుమార్ దంపతులను బ్రాహ్మణ సేవాసంఘం ఘనంగా సత్కరించింది. సంఘం కార్యదర్శి ప్రభాకరశర్మ, కోశాధికారి రామశర్మ, బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మేనేజర్ జి.శ్రీనివాస్, మచిలీపట్నం సంఘ నాయకులు సుబ్రమణ్యం, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫణికుమార్

వైభవంగా లక్ష బిల్వార్చన

పెనమలూరు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస బహుళ చతుర్థశి మాస శివరాత్రి సందర్భంగా తాడిగడప జ్ఞానప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా లక్ష బిల్వార్చన, అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. అనంతరం మహాన్యాసం, మహారుద్ర కలశ స్నపన, శ్రీరుద్ర అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటలకు అన్నాభిషేకం, రెండున్నర గంటల నుంచి లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించిన అనంతరం ఆరుగంటలకు ఆలయ శిఖర శక్తి చైతన్యస్నపన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు తాడిగడప భక్తుల సహకారంతో అఖండ అన్న సమారాధన నిర్వహించారు.



ప్రాణదీపాన్ని వెలగిస్తున్న చైతన్యవాసు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కార్తీకమాస మాస శివరాత్రి సందర్భంగా పెరికీడులోని పంచాయతనక్షేత్రమైన శ్రీముక్తి కాంతా సమేత ముక్తేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం దశసహస్రదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పెరికీడులోని ముక్తేశ్వర స్వామికి అడుసుమిల్లి చైతన్యవాసు, రాజహంస దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీసేవలో పాల్గొన్నారు.దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ఎండీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, అనురాధ దంపతుల సహకారంతో నిర్వహించిన దశసహస్ర దీపోత్సవంలో మహిళలు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన అవసరం

●ఎంపీడీవో అనూష

కంకిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కంకిపాడు ఎంపీడీవో అనూష పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనూష మాట్లాడుతూ గ్రామాల్లో క్లీన్ అండ్ గ్రీన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులపై ఉందన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు.

ఉయ్యూరు: గ్రామాలలో పచ్చదనం పరిశుభ్రతపై కేంద్రప్రభుత్వం నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగమైన థీమ్-5పై మండలంలో గ్రామసర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ గ్రామాలలో పచ్చదనం- పరిశుభ్రత పాటించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధిద్దామన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న ఎంపీడీవో అనూష

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): స్థానిక బాపులపాడు శివాలయం ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి మంగళవారం జంక్షన్‌కు చెందిన భక్తురాలు శానంపూడి ఝాన్సీరాణి తన భర్త వెంకటరత్నం జ్ఞాపకార్థం రూ.1,116,000లు విరాళం అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు గూడపాటి రత్నశేఖర్ తెలిపారు. , కమిటీ సభ్యులుకొల్లి వెంకట్రావు, వీరమాచనేని నాగయ్య, రాంబాబు దాత కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావు, సౌజన్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాపులపాడుకు చెందిన ఎమ్మెస్సీ రెండవ సంవత్సరం చదువుతున్న గుండిమెడ రాంబాబుకు కాలేజీ ఫీజులు నిమిత్తం మంగళవారం మానవతా జంక్షన్ శాఖ సభ్యులు రూ.7,500లు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక మానవతా కార్యాలయంలో విద్యార్థికి మానవతా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శాఖ అధ్యక్షుడు బాణాల నరసింహారావు,కార్యదర్శి పాబోలు గణేష్ తదితర సభ్యులు విరాళం అందజేశారు..



కుర్చీలు, బల్లలు అందజేస్తున్న తెలుగుయువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఏనుగ జయప్రకాష్

కుర్చీలు, బల్లల వితరణ

కంకిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వో అసోసియేషన్ కార్యాలయానికి తెలుగుయువత నాయకులు రూ. 20 వేలు విలువైన కుర్చీలు, బల్లలు వితరణగా ఇవ్వడం అభినందనీయమని అసోసియేషన్ అధ్యక్షుడు మల్లిఖార్జునరావు అన్నారు. కంకిపాడులోని వీఆర్వో అసోసియేషన్ కార్యాలయానికి రూ. 20 వేలు విలువైన కుర్చీలు, బల్లలను తెలుగుయువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఏనుగ జయప్రకాష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి చైతన్య, మద్దూరు రఘురామ ప్రసాద్, కాపు సమాఖ్య నాయకులు పచ్చిపాల రాజ, పవన్ పాల్గొన్నారు.

బాపులపాడులో ఉచిత పశువైద్య శిబిరం రేపు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాపులపాడు పశువైద్య శాలలో ఈ నెల 20న శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు పశుసంవర్థక శాఖ బాపులపాడు ఏడీ ఎం.ప్రమీలరాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాడి పశువులు, పెంపుడు జంతువులకు వైద్యపరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వాతావరణంలో మార్పులు .. ఆందోళనలో అన్నదాతలు



పొలాల్లో కోతకోసిన వరి పనలు కట్టి కుప్ప వేస్తున్న కూలీలు

ఉయ్యూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు కోసి రోడ్లపక్కన ధాన్యం ఆరబెట్టిన పరిస్థితుల్లో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆకాశం మబ్బులు కమ్ముకుని వాతావరణంలో మార్పు రైతుల గుండెల్లో దడపుట్టించింది. కొన్నిప్రాంతాల్లో యంత్రాలతో కోత కోయించి ధాన్యం రోడ్లపక్కన, దిబ్బల పైన ఆరబెట్టి ఉంచగా, మరి కొన్ని చోట్ల కూలీలతో కోయించి పొలాల్లో పనలపై ఉంచారు. ఈపరిస్థితుల్లో మబ్బులు కమ్మి వాతావరణం మార్పుకన్పించడంతో ఆరబెట్టిన ధాన్యం పోగుచేసి పైన పట్టాలు కప్పి ధాన్యం తడవ కుండా రైతులు పాట్లు పడుతున్నారు. పొలాల్లో పనలపై ఉన్న పంటను హడావిడిగా కట్టి కుప్పవేసేందుకు రైతులు ఎక్కువ కూలీ ఇచ్చి పనులు చేయించారు. ఈనెల 22న మరో అల్పపీడనం ఏర్పడవచ్చన వాతావరణ హెచరికలు రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి.



చినఓగిరాలలో ఆరబెట్టిన ధాన్యం పోగుచేసి పట్టాలు కప్పుతున్న కూలీలు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

● గోనుగుంట్ల కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెంపొందుతుందని , గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా గన్నవరం గ్రేడ్-1 గ్రంథాలయంలో సాంకేతిక పరిజ్ఞానం-గ్రంథాలయాల ఉపయోగం, సభ్యత్వ కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఆకేపాటి కృష్ణమోహన్, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వేములపల్లి రవికుమార్, డాక్టర్ మన్నం వెంకట్రాయుడు, డాక్టర్ జిఎ ప్రసాదరావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు, జాస్తి విజయభూషణ్‌కుమార్, గన్నె వెంకట్రావు, లైబ్రేరియన్ కె.నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఉయ్యూరులో వి ద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వేర్వేరుగా స్వాతంత్ర సమరయోధులు అనే అంశముపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంఘ సేవకురాలు ఆర్ వీరకుమారి 30 మంది విద్యార్థులకు గ్రంథాలయ ధరావతు చెల్లించి సభ్యులుగా చేర్పించారు. కాటూరు గ్రంథాలయంలో వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్‌పోటీలు నిర్వహించగా ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, స్వరూపరాణి పర్యవేక్షించారు. ముదునూరులో విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి నాగరాజు పర్యవేక్షించారు.

గన్నవరం: గ్రంథాలయాలను విద్యార్థులతో పాటు అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయా సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అన్నారు. ముస్తాబాద గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాదీ వారోత్సవాలను నిర్వహించి వారిలోని ప్రతిభను వెలికితీస్తున్నట్లు తెలిపారు. నవభారత్ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమాం, లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి తదితరులు పాల్గొన్నారు. పురుషోత్తపట్నం లైబ్రేరియన్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సర్వజనులకు విజ్ఞానవినోదాలను అందించే పుస్తకభాండాగారాలు గ్రంథాలయాలని, యువత సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం నిర్మల సూచించారు. వీరవల్లిలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అధికారి స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో 100మంది విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ●కానుమోలు గ్రంథాలయాధికారి రహీం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, క్యారమ్స్, పోటీలు నిర్వహించారు. హెచ్ఎం పద్మజ, సుంకర సాంబశివరాయల్, దుర్గారావు, చెల్లమ్మ, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు శ్రీదేవి పర్యవేక్షించారు.

● తేలప్రోలు గ్రంథాలయాధికారి కృపానందం ఆధ్వర్యంలో వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. హైస్కూల్ ఉపాధ్యాయుడు సుబ్బారావు, జూనియర్ కాలేజీ లెక్చరర్ వసుంధర పర్యవేక్షించారు.

● ఆత్కూరు గ్రంథాలయాధికారి వీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వకృత్వపోటీలు నిర్వహించారు. హైస్కూల్ ఉపాధ్యాయులు బాలకృష్ణ, శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్: 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బాపులపాడు శాఖ గ్రంథాలయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో బాపులపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రమేష్, పర్యవేక్షించారు.



గ్రంథాలయాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారి స్వర్ణలతాదేవి





కృష్ణాడెల్టా చీఫ్ ఇంజనీర్ రాంబాబును కలిసి వినతిపత్రం అందజేస్తున్న బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు

వరద నష్టం పునరుద్ధరణ పనుల్లో అవకాశం ఇవ్వాలి

● ఏపీ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వినతి

గవర్నర్‌పేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం సెప్టెంబరులో సంభవించిన వరదల కారణంగా జరిగిన నష్టాన్ని పునరుద్ధరించే పనుల పనుల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఉన్న చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఇరిగేషన్ అధికారులను కోరారు. సివిల్ కోర్టుల సమీపంలోని ఇరిగేషన్ కార్యాలయంలో కృష్ణాడెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ రాంబాబును అసోసియేషన్ ప్రతినిధులు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వివిధ నియోజకవర్గాల్లో చేపట్టబోయే రూ.30 కోట్ల పనుల్లో టెండర్లను ప్యాకేజీలుగా కాకుండా విడివిడిగా పిలవాలని కోరారు. చిన్నచిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లను దృష్టిలో పెట్టుకుని పనులకు టెండర్లు పిలవాలని, డివిజన్ స్థాయిలోనే టెండర్లు ఖరారు చేయాలని, టెండర్లు పారదర్శకంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులను కలిసిన వారిలో అసోసియేషన్ మండల స్థాయి అధ్యక్షుడు సబ్బా కృష్ణ, ట్రెజరర్ వెంకటేశ్వరరాజు, జాయింట్ సెక్రటరీ భూపతిరెడ్డి, ఈసీ మెంబరు వీరంకి శ్రీధర్ తదితరులు ఉన్నారు.



శాప్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ప్రకాశం జిల్లా కబడ్డీ క్రీడాకారులు

మాకు తెలియకుండానే హైకోర్టులో కేసులు!

● శాప్ అధికారులకు ప్రకాశం కబడ్డీ క్రీడాకారుల ఫిర్యాదు

విజయవాడ(స్పోర్ట్స్), నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రమేయం లేకుండా, తమ సంతకాలు లేకుండా హైకోర్టులో తాము కేసులు వేసినట్లు కొంతమంది వ్యక్తులు ఆరోపణలు చేస్తున్నారని ప్రకాశం జిల్లా కబడ్డీ క్రీడాకారులు కె.హరిప్రసాద్ రెడి, జి.సమరసింహరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా తమ సంతకాలతో కేసులు ఏవిధంగా కేసులో వేశారో అర్థం కావడం లేదన్నారు., దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం శాప్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల ఎంపికకు వెళ్లిన తాము అర్హత సాధించలేదన్నారు. ఆ సమయంలో కబడ్డీ క్రీడాకారులు కొందరు వ్యక్తులు తమతో మాట్లాడడం జరిగిందన్నారు. ఆ తరువాత కొన్ని రోజులకు తమను ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నిస్తూ హైకోర్టులో తమ పేరుతో కేసు వేసినట్లు నోటిసులు రావడంతో ఆశ్చర్యపోయామన్నారు. ఈ విషయాన్ని శాప్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఇటువంటి చర్యలతో ప్రతిభగల క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు. ఇటువంటి చర్యలతో క్రీడాకారుల భవిష్యత్తుతో ఎవరూ ఆడుకోవద్దని వేడుకుంటున్నామన్నారు.

లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక చట్టాల రద్దు కోరుతూ నిరసన ప్రదర్శనలు 26న

గాంధీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లేబర్ చట్టాలను, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, కలెక్టర్లకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు అందజేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయా సంఘాల సమావేశం మంగళవారం జరిగింది. ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బడా కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర వనరులను పప్పుబెల్లాలుగా పంచుతున్నారని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వైట్ ఎలిఫెంట్ అని, కార్మికులు పని చేయని దొంగలని, వారిపై పీడీ యాక్ట్ పెడతానని చంద్రబాబు హెచ్చరించడం సరైందికాదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని ధ్వజమెత్తారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతు సంఘం నేత కేశవరావు, రైతుకూలీ సంఘం అధ్యక్షులు సింహాద్రీ ఝాన్సీ, ఏఐకెఎఫ్‌టీయూ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి రామకృష్ణ, టీయూసీఐ అధ్యక్షుడు మరీదు ప్రసాద్‌బాబు, సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు వెంకటసుబ్బమ్మ, చలసాని రామారావు పాల్గొన్నారు.



అలరించిన జపాన్ డ్రమ్ టావో ప్రదర్శన

లబ్బీపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన జపాన్ డ్రమ్ టావో బృందం విజయవాడలో మంగళవారం నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. బందర్ రోడ్డులోని పీవీపీ మాల్‌లో టయోటా కిర్లోస్కర్ మోటర్ డ్రమ్ టావో ప్రదర్శనను తిలకించి నగరవాసులు అభినందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ భారతదేశ పర్యటనలో బెజవాడలో నిర్వహించిన ప్రదర్శన ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. భారత్, జపాన్ మధ్య కళాత్మక బంధం, దీర్ఘకాల సాంస్కృతిక సంబం ధాలు లక్ష్యంగా ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శక్తివంతమైన టైకో డ్రమ్మింగ్, కచ్చితమైన సమకాలీకరణ, దృశ్యపరంగా అద్భుతమైన ప్రదర్శనను నగరవాసులు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. భారత్ 14 రోజుల పాటు పలు నగరాలలో ప్రదర్శనలిస్తామని, నవంబర్ 20న చెన్నైలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

15 కిలోల కంద



ఉయ్యూరు సీడీసీ కార్యాలయం సమీపంలోని వాటర్‌ట్యాంక్ రోడ్డులో లంక ప్రసాద్ పెరటిలో పెరిగిన కంద దుంప 15 కిలోల బరువుతో అబ్బురపరుస్తోంది. ఏవిధమైన ఎరువులు వేయకుండానే నేల సారంతోనే పెరిగిన కంద దుంపను తవ్వి బయటకు తీయగా 15 కిలోలు ఉందని ప్రసాద్ తెలిపారు. - ఆంధ్రజ్యోతి, ఉయ్యూరు

చరిత్ర మరువని జలప్రళయం

● శవాల దిబ్బగా దివిసీమ ● ఉప్పెనకు 48 ఏళ్లు

(నాగాయలంక - ఆంధ్రజ్యోతి)

దివిసీమ వాసులు 1977 నవంబరు 19న విరుచుకుపడిన జలప్రళయాన్ని తలచుకుంటే నేటికీ వణికిపోతుంటారు. 1977 నవంబరు 19 శనివారం కాళరాత్రిగా మారింది. పెను ఉప్పెన గ్రామాలకు గ్రామాలను సముద్ర గర్భంలోకి ఈడ్చుకుపోయింది. 30 మీటర్లు ఎత్తున ఎగసిపడిన రాకాసి నిముషాల్లోను గ్రామాలను తుడిచిపెట్టేసింది. దివిసీమ శవాల దిబ్బగా మారింది. 10 వేల మందికి పైగా ప్రజలు విగతజీవులయ్యారు. వేలాది పశు సంతతి మృత్యువాత పడింది. కోట్లాది రూపాయలు విలువ ఆస్తినష్టం జరిగింది. నాగాయలంక, కోడూరు మండలాల తీర ప్రాంత గ్రామాలలో ఎక్కడ చూసినా శవాల గుట్టలే. పోయిన వారి ఆప్తుల రోదనలు, ఆర్తనాదాలు సముద్రుడి హోరులో కలిసిపోయాయి. నాగాయలంక మండలంలోని ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ, నాచుగుంట, దీనదయాళ్ పురం, కమ్మనమోలు, సొర్లగొంది, సంగమేశ్వరం, ఏటిమొగ, గుల్లలమోద, బావదేవరపల్లి, కోడూరు మండలంలోని గొల్లపాలెం, ఊటగుండం, బసవన్నవానిపాలెం, హంసలదీవి, పాలకాయితిప్ప, ఉల్లిపాలెం, ఇరాలి తదితర గ్రామాలు ఉప్పెన విలయానికి ప్రత్యక్ష సాక్ష్యాలు. నాటి ఉప్పెనలో ప్రాణాలు కోల్పోయిన వారిని ఏడాదికొకసారి స్మరించుకోవటం మానవీయ ధర్మం. అప్పటి ఉప్పెన మృతుల జ్ఞాపకాల చిహ్నంగా దివిసీమ ముఖద్వారం వద్ద నిర్మించిన పైలాన్ స్తంభం ఎప్పటికీ ప్రజలను హెచ్చరిస్తూనే ఉంది. దివిసీమ గాంధీ, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు దివిసీమ ఉప్పెన బాధితులకు అందించిన సేవలు అనిర్వచనీయం, నిత్యస్మరణీయం.

జ్ఞాపకం



మచిలీపట్నం టౌన్ : దివిసీమ ప్రళయాన్ని కళ్లారా చూసిన శారద నాగర్‌లోని ప్రత్యక్ష సాక్షుల అనుభవం వారి మాటల్లోనే..

ఒళ్లు గగుర్పొడుస్తుంది



పెనుగాలులు వీచాయి. ఇళ్లల్లోకి నీరు వచ్చేసింది. తల మునిగిపోయే నీరు. భార్యను బుజాన వేసుకుని తీసుకుని వెళ్లా ఎత్తైన ప్రదేశానికి వెళ్లాం. ఎలా బతికిబయపడ్డామో తలుచుకుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది.

- కంఠంనేని నాగభూషణం, శారదానగర్

పెళ్లయిన వెంటనే జరిగిన సంఘటన



పెళ్ళయిన వెంటనే జరిగిన సంఘటన ఇది. ఇల్లు మొత్తం కొట్టుకుపోయింది. అప్పుడు మా ఇల్లు మేడింపేటలో ఉండేది. ఇళ్ల పైకి వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నాము. కూలిపోయిన ఇళ్లలో 80 మంది చనిపోయారు.

- రాంవరపు నతానియేలు

స్నేహితులు చనిపోయారు



మా పేటలోకి 10 అడుగుల ఎత్తున సముద్రపు నీరు వచ్చింది. మా స్నేహితులు నలుగురు చనిపోయారు. చెట్లు, పుట్టలు ఎక్కి కొందరు బతికారు. కొడాలి వజ్రం చనిపోయింది. కొడాలి సుందరరావు చెట్టు ఎక్కి బతికాడు.

- రాంవరపు తాతయ్య

ఆడవాళ్లను బతికించారు



మా ఆయన కరుణాకరరావు వాసాలు పగుల కొట్టి ఇంట్లో నీళ్లలో ఇరు క్కుపోయిన మమ్మల్ని బతికించాడు. ఒక చంటి పిల్లను బతికించుకోగలిగాను. - జూనపూడి దేవనమ్మ

ఏవీఎస్ రెడ్డి, మండలి కృష్ణారావు సేవలు చిరస్మరణీయం



దివిసీమ ఉప్పెన సమయంలో గ్రామాలకు గ్రామాలకు కొట్టుకుపోయాయి. సర్వేకు వెళ్లాం గ్రామాలు పునర్నిర్మించేందుకు రెండేళ్లు పట్టింది. ఏవీఎస్ రెడ్డి వంటి కలెక్టర్లు, మండలి వెంకటకృష్ణారావు వంటి నాయకు లు దివిసీమను మళ్లీ పునర్నిర్మించారు.

- ఎండి సిలార్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్

అనాదిగా షెల్టర్‌జోన్ బెజవాడ

● ఎప్పుడూ విజయవాడనే ఎంచుకున్న మావోయిస్టులు ● కొండపల్లి సీతారామయ్య ఉద్యమ ప్రస్థానం ఇక్కడి నుంచే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ కమ్యూనిస్టు ఉద్యమ కేంద్రంగా ఉన్న దశలో కొండపల్లి సీతారామయ్య విద్యార్థి, యువజన పోరాటాలు చేశారు. ఆ తర్వాత రివల్యూషనరీ యూత్ అసోసియేషన్ (ఆర్‌వైఏ) వంటి సంస్థల ద్వారా సభ్యత్వాన్ని గణనీయంగా పెంచుకున్నారు. 1980లో పీడబ్ల్యూజీ ఏర్పడటంలో కూడా విజయవాడ కీలక పాత్ర పోషించింది. విజయవాడ నగరంతో కొండపల్లి సీతారామయ్యకు అవినాభావ సంబంధం ఉంది. ఉద్యమం ప్రారంభ రోజులు ఆయన బెజవాడ నుంచి సాగిస్తే.. ఆయన చివరి రోజులు కూడా విజయవాడలోనే గడిచాయి. తన మనవరాలు సంధ్య ఇంట్లో కొండపల్లి సీతారామయ్య చనిపోయారు. ఆ తర్వాత క్రమంలో నక్సల్‌బరీ ఉద్యమం ఊపందుకున్న తరుణంలో కూడా ఎందరో అగ్రనేతలు విజయవాడకు వస్తూ పోతూ ఉండేవారు. ముఖ్యంగా షెల్టర్ కోసం రాకపోకలు సాగించే వారు. అజ్ఞాతవాసం చేయాల్సి వచ్చిన ప్రతిసారీ కూడా నక్సల్స్ విజయవాడకే వచ్చేవారు. సుదీర్ఘ సాయుధపోరాటంలో కొంత కాలం విశ్రాంతి తీసుకోవటానికి వచ్చే వారు. అనారోగ్యానికి గురైన సందర్భంలో చికిత్స తీసుకోవటానికి కూడా వైద్యానికి కేంద్రమైన బెజవాడకే వచ్చేవారు. అప్పట్లో కమ్యూనిస్టు నేపథ్యం కలిగిన వారు ప్రజలకు సేవ చేయటానికి ఆసుపత్రులు నిర్వహించే వారు. అలాంటి ఆసుపత్రులకు నక్సల్స్ వచ్చి చికిత్స తీసుకునేవారు.

మావోయిస్టులకు బెజవాడ ఎప్పుడూ షెల్టర్ జోన్‌గానే నిలిచింది. కొండపల్లి సీతారామయ్య స్థాపించిన పీపుల్స్ వార్ గ్రూప్ మొదలు నక్సలైట్లు, నేటి మావోయిస్టుల వరకు పేరేదైనా పూర్వం నుంచి బెజవాడను షెల్టర్‌జోన్‌గా చేసుకున్నారు. కృష్ణాజిల్లా గుడివాడ మండలం జొన్నపాడు గ్రామానికి చెందిన పీపుల్స్ వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ) అధినేత కొండపల్లి సీతారామయ్య ఉద్యమాన్ని తీవ్రతరం చేయటానికి ముందుగా ఎంచుకున్నది విజయవాడనే!

తాత్కాలికంగా జనారణ్యంలో ఉండాలంటే విజయవాడ సురక్షిత ప్రాంతంగా భావించేవారు. పీపుల్స్ వార్ గ్రూప్ ఇక్క డే పుట్టినా.. నక్సలిజం, మావోయిస్టులు ఇలా పేర్లు ఏవైనా సరే.. విజయవాడ కేంద్రంగా మారణహోమా లు ఎప్పుడూ జరగలేదు. ఒక్కసారి మాత్రమే సున్నపుబట్టీల సెంటర్ దగ్గర నక్సలైట్లు హత్య చేశారు. అది తప్ప ఎప్పుడూ ఈ ప్రాంతం కేంద్రంగా మారణహోమాలు జరగలేదు. మిలీనియంలో మావోయిస్టులు బలం పెంచుకునే క్రమంలో తాము అత్యంత సురక్షిత ప్రాంతంగా భావించే విజయవాడకు రాకెట్ లాంచర్లు, పేలుడు పదార్థాలు, డిటొనేటర్లు, జిలెటిన్ స్టిక్స్ వంటివి దిగుమతి చేసుకున్నారు. ఇది భారీ ఆపరేషన్‌గా నిలిచిపోయింది.

విజయవాడకు దిగుమతి చేసిన వీటిని అడవులలోకి తీసుకువెళ్లే క్రమంలో నిజామాబాద్, ప్రకాశం జిల్లా వంటి ప్రాంతాలకు తరలించిన క్రమంలో పోలీసులకు చిక్కడం జరిగింది. విజయవాడలో ఓ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకు వచ్చిన రాకెట్ లాంచర్ల విడిభాగాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇవి కనుక మావోయిస్టులకు చేరి ఉంటే మరింతగా నరమేధ జరిగి ఉండేది. ఎన్నో మారణహోమాలు చూసి ఉండేవాళ్లం. చరిత్ర చూస్తే ఎన్నో మార్పులకు, మావోయిస్టులకు కార్యస్థలంగా, షెల్టర్‌జోన్‌గా, ఆయుధాల దిగుమతి కేంద్రంగా, సురక్షిత ప్రాంతంగా ఉండేది. అలాంటి విజయవాడ కాలక్రమంలో సెక్యూరిటీ పరంగా దుర్భేద్యంగా మారింది. ఎప్పటిలా తాము సురక్షితంగా భావించే విజయవాడ నగరాన్ని అణువణువూ పోలీసులు సీసీ కెమెరాలతో దిగ్బంధించటంతో నగర శివారుకు మావోయిస్టులు రూటు మార్చారు. కానూరు కొత్త ఆటోనగర్‌ను ఎంపిక చేసుకున్నారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థల కారణంగా కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో మంగళవారం పోలీసులకు చిక్కారు. దీంతో రానున్న రోజులలో విజయవాడ, శివారు ప్రాంతాలను మావోయిస్టులు సురక్షిత ప్రాంతాలుగా భావించే పరిస్థితి ఉండకపోవచ్చు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి

● అరెస్టు చేసిన మావోయిస్టు నేతలను కోర్టులో హాజరుపర్చాలి

● పౌరహక్కుల సంఘం నేతల డిమాండ్

గాంధీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నేతలు మాట్లాడారు.

ఎన్‌కౌంటర్ పేరుతో మావోయిస్టు నాయకుడు హిడ్మా, మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్న మావోయిస్టు పార్టీ నేతలను వెంటనే కోర్టులో హాజరుపర్చా లన్నా రు. వీరిని కూడా ఎన్‌కౌంటర్ చేసి చంపే అవకాశం ఉన్నందున న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకుని జీవించే హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. పౌరహక్కుల సం ఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలుక చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి టి.ఆంజనేయులు, విరసం అధ్యక్షుడు అరపవల్లి కృష్ణ, పీడీఎం రాష్ట్ర నేత జీవీ వెంకటేశ్వరరావు, పీకేఎస్ రాష్ట్ర నేత బి.కొండారెడ్డి పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధిలో రోల్‌మోడల్ చేద్దాం

● ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తితో అడుగులేద్దామని, పారిశ్రామిక అభివృద్ధిలో జిల్లాను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడంలో సమిష్టిగా కృషి చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం మంగళవారం జరిగింది. పారిశ్రామిక అనుమతులు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు తదితరాలతో పాటు వివిధ పథకాల అమలుపై సమావేశంలో చర్చించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఎన్టీఆర్‌జిల్లాకు సంబంధించి దాదాపు రూ.69 వేల కోట్లతో 100 ఎంవోయూలు కుదిరాయన్నారు. అన్ని కోణాల్లో పెట్టుబడిదారులకు అవసరమైన సహాయ సహకారాలను అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర సాకారానికి పారిశ్రామిక అభివృద్ధి కీలకమన్నారు. ఇటీవల విజయవాడ సెంట్రల్, మైలవరం నియోజకవర్గాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులతో పాటు జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన జరిగినట్లు తెలిపారు. వివిధ అనుమతులకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నవంబరు 17 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 6,037 దరఖాస్తులు రాగా 5,949 దరఖాస్తులు పరిష్కారమయ్యాయన్నారు. మిగిలిన వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ పారిశ్రామిక అభివృద్ధి విధానా ల కింద 18 క్లెయిమ్‌లకు రూ.1.54 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలకు కమిటీ ఆమోదం తెలిపింది. పరిశ్రమల ఏర్పాటుకు అత్యుత్తమ వాతావరణం రాష్ట్రంలోనూ జిల్లాలోనూ వుందన్నారు. ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమాన్ని ముం దుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. 2025-26కు సంబంధించి పీఎంఈజీపీ, పీ ఎం విశ్వకర్మ పథకాల అమలులో పురోగతి ని కమిటీలో చర్చించి, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు, యూనిట్ల ప్రారంభానికి కలెక్టర్ లక్ష్మీశ దిశానిర్దేశం చేశారు. రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎం ఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్)కు సంబంధించి షెడ్యూల్ ప్రకారం వర్క్‌షాపులను నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, డీపీవో పి.లావణ్య కుమారి, సాంఘిక సంక్షేమ అధికారి రమాదేవి, ఎల్‌డీఎం కె.ప్రియాంక, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఏపీఐఐసీ, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు కనకదుర్గ, మురళీకృష్ణ, వక్కలగడ్డ భాస్కరరావు, బుచ్చిబాబు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



డీఎస్సీలో ఉత్తీర్ణులయిన ఉపాధ్యాయులను సన్మానించిన అనంతరం మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు జి. కోటేశ్వరరావు

అమరావతిలో రూ.150 కోట్లతో కేంద్ర గ్రంథాలయం

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో రూ. 150 కోట్లతో కేంద్ర గ్రంథాలయ భవనాన్ని రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం బందరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకుని ఉద్యోగాలు సంపాదించిన 17 మందిని సత్కరించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ, శోభ డెవలపర్స్ అమరా వతిలో నిర్మించే గ్రంథాలయ భవనానికి రూ. 100 కోట్లు విరాళం ఇచ్చిం దన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గ కేంద్రాల్లో గ్రంథాలయాలను మోడల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పాఠకులకు అవసరమైన గ్రంథాలను కొనుగోలు చేస్తామన్నారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకుడు ఏ. కృష్ణమోహన్ మాట్లాడుతూ, 1920 నాటి గ్రంథాలను డిజిటలైజ్ చేసి వెబ్‌సైట్‌లో పెడుతున్నామన్నారు. రచయితలు జీవించి ఉండగా డిజిటల్ లైబ్రరీలో పెట్టలేమని, మృతి చెందిన రచయితల పుస్తకాలను డిజిటలైజ్ చేసి అందరికీ అందుబాటులో ఉండే విధంగా చేస్తున్నామన్నారు. గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాల జాబితాలను వెబ్‌సైట్‌లో పెడుతున్నామన్నారు. ఏ గ్రంథాలయంలో ఏ పుస్తకం ఉందో పాఠకులకు తెలిసే విధంగా ఒక వెబ్‌సైట్‌ను రూపొందించామన్నారు. రాష్ట్రంలో గ్రంథాలయాలకు దాదాపు రూ. 500 కోట్లు సెస్సు బకాయిలు రావాల్సి ఉందన్నారు. వాటిని వసూ లు చేసి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు గ్రంథాలయాల అబివృధ్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. త్వరలో ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ బి. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కోసం కన్న తండ్రి కక్కుర్తి

● మైనార్టీ తీరకుండానే కూతురికి వివాహం

● బాలికకు మద్యం తాగించి కాపురానికి పంపినవైనం

● తండ్రి, వివాహం చేసుకున్న వ్యక్తి అరెస్టు

● గణపవరంలో ఆలస్యంగా వెలుగులోకి

మైలవరం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో డబ్బుకోసం కక్కుర్తిపడిన తండ్రి మైనరైన కూతురుకు రెండు సార్లు వివాహం చేశాడు. మద్యం అలవాటు చేసిన తండ్రి, 43 ఏళ్ల ఉన్న వ్యక్తితో పెళ్లి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైలవరం ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గణపవరానికి చెందిన ఏరువ జమలారెడ్డికి భార్యతో మూడు సంవత్సరాల క్రితం విడాకులు అయ్యాయి. ఒంటరిగా ఉంటున్న జమలారెడ్డి మద్యానికి బానిసై ఉన్న పొలాన్ని అమ్ముకొని వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే బెల్లంకొండ నాగరాజు తన కుమార్తె(15)ను ఇచ్చి పెళ్లి చేస్తానంటూ జమలారెడ్డి వద్ద పలుమార్లు రూ.20 లక్షలు తీసుకున్నాడు. ఆ డబ్బుతో నాగరాజు కార్లు, తదితర వస్తువులు కొన్నాడని చెప్పాడు నాగరాజు ఇచ్చిన మాట ప్రకారం జమలారెడ్డితో కూతురు(15)కు వివాహం చేశాడు. వివాహం ఇష్టం లేని బాలిక పుట్టింటికి వచ్చేసింది. ఈనెల 12వ తేదీన నాగరాజుకు మళ్లీ డబ్బులు అవసరపడి జమలారెడ్డిని అడగ్గా, కూతురిని కాపురానికి పంపిస్తేనే డబ్బులు ఇస్తానని చెప్పాడు. నాగరాజు పథకం ప్రకార తన కూతురితో మద్యం తాగించి జమలారెడ్డి వద్ద రూ.10 వేలు నగదు తీసుకొని కూతురును కాపురం చేసుకోమని చెప్పి వదిలేసి వచ్చాడు. జమలారెడ్డి అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాలిక చుట్టుపక్కల వారి సహాయంతో అక్కడ నుంచి బయటపడి పోలీసులను ఆశ్రయించినట్లు ఎస్సై సుధాకర్ వివరించారు. బాలిక ఫిర్యాదు మేరకు జమలారెడ్డి, నాగరాజులపై పోక్సో కేసు నమోదు చేసి, సోమవారం రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు.

బాలికతో బలవంతంగా వ్యభిచారం చేయించిన

నిందితురాలికి పదేళ్ల జైలు

విజయవాడ లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలికతో బలవంతంగా వ్యభిచారం చేయించిన కేసులో నిందితురాలిపై నేరం రుజువుకావడంతో పదేళ్ల జైలుశిక్ష, రూ.23 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో బాధితురాలైన బాలిక (17) తల్లి చిన్న తనంలో చనిపోవడంతో అమ్మమ్మ వద్ద పెరుగుతోంది. కొంత కాలం తర్వాత అమ్మమ్మ తాను పెంచలేనని చెప్పడంతో చెల్లి (16)తో కలిసి బాలిక ఆటోనగర్‌లోని ఓ ఇంటిలో ఉంటోంది. ఈ క్రమంలో 2016లో సింగ్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ జమాల్‌బీ, ఆమె భర్త కమల్ బాషా పరిచయమై తమ ఇంటిలో ఉండమని, జాగ్రత్తగా చూసుకొంటామని చెప్పడంతో బాలికలిద్దరూ వారింటికి వెళ్లారు. కొన్ని రోజులు బాగానే చూసుకొన్న తర్వాత వారితో బలవంతంగా వ్యభిచారం చేయిస్తుండడంతో తప్పించుకోవడానికి ప్రయత్నించారు. కమాల్‌బీ దంపతులు బాలికలను పట్టుకొని కొట్టి తాళం వేసి ఇంటో బంధించారు. బాధితురాలి చెల్లిని కమల్‌బాషా హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ ఒక రూమ్‌లో పెట్టి వ్యభిచారం చేయించాడు. పారిపోవడానికి ప్రయత్నిస్తే చెల్లిని అక్కడ చంపేస్తామంటూ బెదిరించినట్లుగా బాధితురాలు 2017 అక్టోబరు 14న సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యభర్తలిద్దరిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఇదిలా వుండగా 2024 మే 15న కమల్‌బాషా ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గద్దం రాజేశ్వరరావు 17 మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితురాలిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. బాలికలు ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున ఇద్దరికి కలిపి రూ.5 లక్షలు నష్టపరిహారం వచ్చేలా చూడాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీని న్యాయమూర్తి ఆదేశించారు.

పరీక్షలకు ముందే విద్యార్థులు రికార్డుల్లోని తప్పులను సరిదిద్దుకోవాలి : డీఈవో

విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు తమ వివరాలు పాఠశాల రికార్డులో ఉన్న విధంగా ఉన్నాయో లేదో యు డైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో సరిచూసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వివరాలను ఒకసారి సరిచూసుకుని, తప్పులకు ఆస్కారం లేకుండా ప్రధానోపాధ్యాయులకు తెలియపరిస్తే వారు అప్‌లోడ్ చేస్తారని పేర్కొన్నారు. ఒకవేళ విద్యార్థుల వివరాలు తప్పులు నమోదై ఉంటే ఆధార్ కార్డు సరిచేసుకుని, అపార్ ఐడీ, యుడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో తప్పులు సరిచేసుకోవడానికి పాఠశాల విద్యాశాఖ అవకాశం కల్పించిందన్నారు. పరీక్షల అనంతరం ఎటువంటి తప్పులు సరి చేసుకోవడానికి ఉండదన్నారు. ఇప్పుడే తప్పులను సరిదిద్దుకోవాలని ఆయన వెల్లడించారు. పరీక్ష ఫీజులు కూడా చెల్లించుకోవాలని, రూ.125 కంటే ఎక్కువ వసూలు చేసినట్టయితే తమకు ఫిర్యాదు చేస్తే అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 650



కొండాలమ్మ ఆలయంలో బహిరంగ వేలం

గుడ్లవల్లేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సమర్పించే తలనీలాలు పోగుచేసుకొనేందుకు నిర్వహించిన వేలంలో గత ఏడాది రూ.458000లు కాగా ఈఏడాది రూ.800000కు పాడుకొన్నారని ఆలయ ఈవో కొండలరావు తెలిపారు. అలానే భక్తులు అమ్మవారికి సమర్పించే వరి ధాన్యం బస్తాకు రూ.1600 లకు పాడుకొన్నారని ఆయన చెప్పారు. దేవాదాయ శాఖ అధికారి సమ్మెట ఆంజనేయ స్వామి , ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్ తదితరులు పాల్గొన్నారు.


కొండాలమ్మ ఆలయంలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు


గురుకుల పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఎంఈవో బాలాజీ

విద్యతోనే ఉన్నత స్థితి సాధ్యం

గుడి వాడ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని ఎంఈవో బాలాజీ అన్నారు. మంగళవారం మోటూరులోని గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. వంట షెడ్లను, బాలికలు నిద్రించే ప్రదేశాలను, బాత్ రూములను బాగున్నది లేనిది పరిశీలించారు. క్లాస్ రూములు ఏ విధంగా ఉన్నాయని, విద్యార్థులకు బోధన ఎలా చెబుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఉపాధ్యాయులు ఇబ్బంది పెట్టినా సక్రమంగా పాఠాలు బోధించకపోయినా నిర్భయంగా తెలపాలని బాలికలను కోరారు. బాలబాలికలతో ఏ విధంగా చదువుతున్నది, ఎవరికి ఎన్ని మార్కులు వస్తుందో అడిగి తెలుసుకున్నారు.


కోర్టు ఆవరణలో మాజీ కౌన్సిలర్లు

కోర్టుకు హాజరైన కూటమి నేతలు

గుడివాడ, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా టీడీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నామినేషన్ ర్యాలీలో స్థానిక ఏలూరురోడ్డులో జరిగిన గొడవలో పోలీసులు పెట్టిన కేసులో కూటమి నాయకులు కోర్టుకు హాజరయ్యారు. మాజీ కౌన్సిలర్లు వసంతవాడ దుర్గారావు, శొంఠి రామకృష్ణ, కూటమి నాయకులు ముళ్లపూడి రమేష్, మిక్కిలినేని రమేష్, వేమూరి త్రినాథ్ తదితరులు హాజరైన వారిలో ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ధ్యేయం

• ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో మండల పరిషత్, గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాల అమలు, అభివృద్ధి పనుల్లో సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో గుడ్లవల్లేరులో మూడు, నందివాడలో ఐదు, గుడివాడ రూరల్‌లో నాలుగు పీహెచ్‌సీలు నూతనంగా మంజూరయ్యాయని, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నియోజకవర్గంలో 932 మంది గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోగా, 465 మంది ఎంపికైనట్టు తెలిపారు. ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాల పురోగతిని ఎంపీడీవోలు, గృహనిర్మాణ శాఖ అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు విష్ణుప్రసాద్, ఇమ్రాన్, మల్లీశ్వరీ, గృహ నిర్మాణ శాఖ ఈఈ శివప్రసాద్, ఏఈలు పృథ్వీ, సురేంద్ర, సాయిపవన్,జనసేన ఇన్‌చార్జ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రూ.3.96కోట్లతో బైపాస్ రోడ్డు అభివృద్ధి

సీఆర్‌డీఏ, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.3.96కోట్లతో గుడివాడ బైపాస్ రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.2.50కోట్లతో బైపాస్‌రోడ్డుకు, సీఆర్‌డీఏ నిధులు రూ.1.46కోట్లతో ఇరువైపులా సీసీ డ్రెయిన్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఇటీవల రూ.58లక్షలతో రహదారికి మరమ్మతులు చేశామన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో సమస్య పునరావృతమవుతుందన్నారు. నియోజకవర్గంలోని నందివాడ, గుడివాడ రూరల్, గుడ్లవల్లేరు మండలాల్లో సమస్యాత్మకంగా ఉన్న ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.2.10కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డి.ఈ కామేశ్వరరావు, కాంట్రాక్టర్ సతీష్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.


ఆర్‌అండ్‌బీ, గృహ నిర్మాణశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

క్షత్రియ సేవాసమితి కార్యవర్గం


రవిరాజు


దామోదరరాజు

గుడివాడ, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : గుడివాడ క్షత్రియ సేవాసమితి నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కోసూరి రవిరాజు, దళపతిరావు దామోదరరాజులు ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక బైపాస్‌రోడ్డులోని ముదునూరి సూరిబాబు కాంప్లెక్స్‌లో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సమితి గౌరవాధ్యక్షుడిగా కనుమూరి భాస్కరరాజు, గౌరవ సలహాదారుగా గాదిరాజు జగ్గరాజు, కోశాధికారిగా కుచ్చర్లపాటి శ్రీనివాసరాజు, ముఖ్య సలహాదారులుగా ముదునూరి సూర్యనారాయణరాజు(సూరిబాబు), రుద్రరాజు విజయకుమార్‌రాజు, ఉపాధ్యక్షులుగా సాగిరాజు ఉదయభాస్కరరాజు, వర్కింగ్ కార్యదర్శిగా సాగిరాజు విజయరంగరాజు, సమితి పరిచయకర్తగా ఎం.పి రాజుతో పాటు 10మంది సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యువకుడు కనిపించడంలేదని ఫిర్యాదు

గుడివాడ రూరల్ :మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీకు చెందిన షేక్ రహమత్ అలీ ఈ నెల 16వ తేదీ నుంచి కనిపించడం లేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ తెలియరాలేదని తల్లి జహీరున్నీసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గుడివాడ తాలుకా ఎస్సై ఎస్.చంటిబాబు తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

• వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్

గుడివాడ, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక ఏఎన్‌ఆర్ కళాశాలలో డ్రగ్స్ వాడకం, వాటి దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఐ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తమ పిల్లల నడవడికను గమనిస్తూ ఉండాలన్నారు. 15-25ఏళ్ల లోపు యువత ఎక్కువగా మత్తుకు బానిసలవుతున్నారన్నారు. డ్రగ్స్ మహమ్మారి నేడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న భయంకర వ్యసనమన్నారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మీ, ఆకర్ష ఫౌండేషన్ సైకాలజిస్ట్ జగదీష్, ఎన్.వై.కె సభ్యులు శ్వేత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్ఆర్‌కే ప్రసాద్ , కె.ఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.


డ్రగ్స్‌పై ప్రచారం నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

డ్రెయిన్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

• ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : డ్రెయిన్లలో పేరుపోయిన పూడికలను ఎప్పటి కప్పుడు తొలగించి, పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని అరవపేట, స్లాటర్‌పేట, చౌదరిపేట, చెంచుకాలనీ ప్రాంతాల్లో తన ద్విచక్రవాహనంపై ఎమ్మెల్యే పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా రహదారిపై మురుగునీరు నిల్వ ఉండటాన్ని గమనించి మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.చెంచుకాలనీ ప్రాంతంలో డ్రెయినేజీ సమస్య వల్ల మురుగునీరు రహదారిపై చేరుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మురుగునీరు తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఫోన్‌లో మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక నేతలు పంద్రాజు సాంబశివరావు, చేకూరు జగన్మోహనరావు, కడియాల గణేష్ తదితరులు ఉన్నారు.


మురుగునీటిని తొలగించాలని ఫోన్‌లో సూచిస్తున్న వెనిగండ్ల

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

• ఎంఈవో డేవిడ్ రాజు

గుడి వాడ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని నందివాడ ఎంఈవో డేవిడ్ రాజు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌పీఎస్ పాఠశాల్లో గుడివాడ, గుడ్లవల్లేరు, పెదపారుపూడి, నందివాడ మండలాల ఉపాధ్యాయులకు ట్రైనింగ్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కగా బోధించటమే కాకుండా వారికి అర్థం కాని విషయాలు అర్థమయ్యేలా చేసి నూరుశాతం ఉత్తీర్ణత శాతం సాధించాలని కోరారు. ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేసి మంచి వాతావరణం తీసుకురావాలన్నారు. ఎంఈవో గోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్ రాజు

శివాలయాలకు కార్తీక శోభ

తోట్లవల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెనమకూరులోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా కార్తీక దీపాలను శివలింగం తదితర రూపాల్లో భక్తులు వెలిగించారు. భక్తులతో సందడి నెలకొంది.

కూచిపూడి: కూచిపూడిలోని గంగాబాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక బహుళ చతుర్ధ మాస శివరాత్రిని పురస్కరించుకుని స్వామికి లక్ష బిళ్వార్చన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గుడ్లవల్లేరు: కూరాడ రామాలయంలో మంగళవారం రాత్రి లక్ష వత్తుల దీపార్చన వైభవంగా నిర్వహించారు. కార్తీకమాస మాసశివరాత్రిని పురస్కరించుకొని లక్షఒత్తుల దీపార్చనను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కూరాడ రామలింగేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.


కూరాడలో దీపార్చన చేస్తున్న మహిళలు

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల నేడు

తోట్లవల్లూరు, నవంబరు 18 : (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో బుధవారం మధ్యాహ్నం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల సందర్భంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతులతో సదస్సు ఏర్పాటు చేయటమైందని, దీనికి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ముఖ్య అతిథిగా హాజరవుతారని మండల వ్యవసాయాధికారిణి జి శ్రీదేవి మంగళవారం తెలిపారు.

గుడివాడ రూరల్: గుడివాడ నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ రెండో విడత, పీఎం కిసాన్ లబ్ధిదారులకు చెక్కుల పపంపిణీ కార్యక్రమం గుడివాడ మార్కెట్ యార్డులో బుధవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతులమీదుగా అందజేయనున్నామని ఏడీఏ సూరపనేని కవిత మంగళవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు

గుడ్లవల్లేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌లో హోమ్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న తోకల రాజశేఖర్ సోమవారం రాత్రి నైట్ బీట్ విధులకు హాజరయ్యాడు. మరో హోమ్‌గార్డ్ అమలేశ్వరరావుతో కలసి అంగలూరు వరకూ వెళ్లి తిరిగి వస్తూ గుడ్లవల్లేరు జోడింతెనల సమీపంలోబురద మట్టిపెళ్లను తొలగించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో మచిలీపట్నం వైపు నుండి వేగంగా వస్తున్న కారు హోమ్‌గార్డు రాజశేఖర్‌ను వెనుకనుండి బలంగా ఢీకొంది. దానితో రాజశేఖర్ రోడ్డుపై ఎగిరి బలంగా రోడ్డుకు ఢీ కొని పడిపోయాడు. అటుగా వస్తున్న యువకుడు సైతం బురద మట్టిపెళ్లపై బైక్ ఎక్కించి రోడ్డుపై పడిపోయి తీవ్రగాయాలపాలయ్యాడు. రాజశేఖర్‌ను, యువకుడిని గుడివాడ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రయివేటు ఆసుపత్రికి గుడ్లవల్లేరు పోలీసులు తరలించారు.

టీడీపీ నేతల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

• ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో ఇటీవల మృతి చెందిన టీడీపీ నేతల కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరామర్శించారు. గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పొట్లూరి రవి మేనకోడలు చిన్నవయస్సులో అమెరికాలో గుండెపోటుతో మృతి చెందారు. కాగా పొట్లూరి రవిని ఎమ్మెల్యే పరామర్శించారు. గుడివాడ మార్కెట్ కమిటీ మాజీఛైర్మన్ వల్లభనేని వెంకట్రావు సోదరి, సంతకమిటీ కార్యదర్శి ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు అత్తగారు ఇటీవల మృతి చెందగా వారిరువురి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అలానే సూరపనేని పరందామయ్య భార్య మృతి చెందగా పరందామయ్యను వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యేతోపాటు టీడీపీ మండల అధ్యక్షులు కొసరాజు బాపయ్యచౌదరి, చెకూరి జగన్మోహనరావు, వెనిగండ్ల రామకృష్ణ, పోలవరపు వెంకటరావు, గుడ్లవల్లేరు పీఏసీఎస్ ఛైర్మన్ యెనిగళ్ల నాగేశ్వరరావు, డీసీ ఛైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్య చౌదరి, ఎ.రాజేష్,వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి పాల్గొన్నారు.


రవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ఈ క్రాప్ నమోదు పూర్తి

గుడ్లవల్లేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ క్రాప్ నమోదు పూర్తయిందనీ, మండలంలోని 16 రైతు సేవా కేంద్రాలలో ఈ క్రాప్ జాబితాలను ప్రచురించామని మండల వ్యవసాయాధికారి సునీల్ తెలిపారు. మంగళవారం డోకిపర్రు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) లో జాబితాని వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఈ క్రాప్‌ను నమోదు చేసిన రైతుల జాబితాలో ఏమైనా సవరణలు, అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలో అన్ని గ్రామాల రైతులు దీన్ని గమనించి తమతమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లోని జాబితాలను చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డోకిపర్రు పీఏసీఎస్ ఛైర్మన్ చింతపల్లి శివారెడ్డి, మాజీ ఛైర్మన్ వీరమాచనేని శివప్రసాద్ పాల్గొన్నారు.

దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు

గుడివాడ : స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేంచేసియున్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్, సాంబశివ, అయ్యప్ప స్వామి సకల దీక్షాపరులకు, దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు రాజబోయిన వీర్రాజు దంపతుల వితరణతో భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీరాంజనేయ స్వామి దేవస్థాన ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు), గురుస్వాములు కూరాకుల బాబి, కె.వీరబాబు, భక్త బృంద సభ్యులు సురేష్, రాజేంద్రప్రసాద్, ఫణికుమార్, మురళీ, శ్రీను, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం

• ఎంపీపీ గద్దె పుష్పరాణి


శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గుడి వాడ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు కీలక భూమిక పోషిస్తారని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. మంగళవారం ఆర్‌జీఎస్‌కే క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పర్యావరణాన్ని రక్షించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : ప్రతి గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతకు గ్రామ పంచాయతీలు పెద్దపీట వేయాలని ఎంపీడీవో రవికాంత్ వివరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన అంశాలను ఎంపీడీవో రవికాంత్, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరమ్మ వివరించారు. డిజటల్ స్క్రీన్‌పై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఎంపీవో-1 వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 సురేష్ పాల్గొన్నారు.

కూచిపూడి : పచ్చదనం - పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మొవ్వ ఎంపీడీవో సుహాసిని పిలుపునిచ్చారు. మొవ్వ మండల పరిషత్ కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలపై సర్పంచ్‌లకు, ఉపసర్పంచ్‌లకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు మంగళవారం ఒక్కరోజు శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కొండేటి ఇందిర, డిప్యూటీ ఎంపీడీవో త్రినాథ్, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుహాసిని

పీహెచ్‌సీలో రికార్డుల తనిఖీ

గుడ్లవల్లేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం కౌతవరం పాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్, రక్త పరీక్షా కేంద్రాన్ని, లాబ్‌లను, ఫార్మశీ విభాగాల్లోని వసతుల గురించి వివరాలు తెలుసుకున్నారు. హాజరు రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ పిహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామాల్లో సిబ్బంది నిర్వహిస్తున్న సేవలను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ బొప్పన శ్రావ్య, డాక్టర్ దుర్గామాధవి, సూపర్వైజర్లు ప్రకాష్,ఉలుసు ఉమా,భాగ్యలక్ష్మి, డిసి ఛైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వరచౌదరి, కొల్లి నాన్జీ,అడుసుమిల్లి శివరాజూష్, నాగన్న,జోజి,సాంబయ్యపాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

గుడివాడ, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : కులమతాలకు అతీతంగా కళాకారుల సమాఖ్య సభ్యులు కార్తీక వనసమారాధనను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని ఏఎన్‌ఆర్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి కె.ఎస్ అప్పారావు అన్నారు. మంగళవారం స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలో కళాకారుల సమాఖ్య గౌరవాధ్యక్షుడు బీవీ మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు విన్నకోట బుజ్జిల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. కళాకారుల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

• జె.విజయలక్ష్మి


తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో..

పెదపారుపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :గ్రంథాలయాను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పొందాలని యలమర్రు గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు వక్తృత్వ , వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 6, 7, 8 తరగతలు విద్యార్థులకు వ్యాసరచన , వక్తృత్వం పోటీలు నిర్వహించారు. 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరికుమారి, హెచ్ఎం అంబేడ్కర్ పాల్గొన్నారు

తోట్లవల్లూరు : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తోట్లవల్లూరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు, ఉర్దూ పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. 95 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని గ్రంథాలయాధికారి బాబూరావు తెలిపారు.

గుడివాడ : స్థానిక షాగులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో కొనసాగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కవిసమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని పలువురు కవులు తమ కవితా గానాన్ని వినిపించారు.సామాజిక కార్యకర్త సయ్యద్ గఫార్ కవులు శ్రీనివాస్, వసుధ బసవేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఎం.వి.డి.టి నగేష్ పాల్గొన్నారు.

పామర్రు : పామర్రులో ఎంపీపీ గరల్స్ స్కూల్లో ద్వితీయశ్రేణి గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం 4, 5 తరగతి విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్, వ్యాస రచన పోటీలు, నిర్వహించారు.


కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న గఫార్

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 650

బండారు దత్తాత్రేయకు ఘన స్వాగతం

మోపిదేవి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మోపిదేవి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, బీజేపీ సీనియర్ నాయకులు వేములపల్లి శ్రీహరి, పెదప్రోలు పంచాయతీ శివారు కప్తానుపాలెం వద్ద ఘన స్వాగతం పలికారు. బుధవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనం, దివిసీమలో పర్యటిస్తారు.



మోపిదేవిలో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కూటమి నేతలు



సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్యకు స్వాగతం

బాల్యవివాహాలతో అనర్థాలు

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య సూచించారు. బందరు మండలం క్యాంపు బెల్‌పేటలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగుల్‌మీరా, రూరల్ ఎస్సై సత్యనారాయణ, టీడీపీ నాయకులు వాటపల్లి జయకృష్ణ, బత్తిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా.. చంద్రబాబు

• మంత్రి కొల్లు రవీంద్ర • సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మోపిదేవి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అంటేనే అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు మంత్రిని పూర్ణకుంభ స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. వేద ఆశీర్వచనం, శేషవస్త్రాలతో పాటు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు అందించారు. ఆలయం వెలుపల మంత్రి మాట్లాడుతూ విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో 13.5 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవటమే చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు మంత్రికి అందజేస్తున్న ఈవో శ్రీరామవరప్రసాదరావు

ఫొటోగ్రాఫర్లకు స్థలం కేటాయిస్తాం..

మచిలీపట్నం టౌన్:మంగినపూడి బీచ్‌లో ఫొటోగ్రాఫర్లకు ఎకరం స్థలం కేటాయిస్తామని, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా నైపుణ్యాలను పెంచుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం డివిజన్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హౌసింగ్‌బోర్డులోని మునిసిపల్ పార్కులో నిర్వహించిన కార్తీక వనసమారాధనలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. పట్టణంలో 5 సెంట్ల స్థలం కేటాయించి షూటింగ్‌లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఫొటోగ్రాఫర్లు తమ శిక్షణా తరగతులకు వినియోగించుకోవచ్చన్నారు. ఫొటోగ్రాఫర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణ

దాతల సహకారంతో అభివృద్ధి చేద్దాం

శాంతా మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో గొడుగుపేటలోని ప్రాచీన దేవాలయం శాంతా మల్లేశ్వరస్వామి దేవాలయాన్ని పునరుద్ధరిద్దామని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా ఉడత్తు కృష్ణచైతన్య, సభ్యులుగా మురాల శ్రీనివాసరావు, బోడి గణపతి, గాదె వెంకటరమణ, దేవత నాని, వేముల సుబ్బారావు, శివశర్మ, దిమ్మెట పోతురాజు, బూరగడ్డ రామాంజనేయులు ప్రమాణ స్వీకారం చేశారు. సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్‌మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, మరకాని సమతాకీర్తి, వేదపండితుడు విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ, ఆలయ అర్చకుడు కందుకూరి సత్యనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సహకార ఉద్యమంలో యువత భాగస్వామ్యం కావాలి

కృష్ణాజిల్లా సహకార అధికారి చంద్రశేఖరరెడ్డి

చల్లపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యమంలో యువశక్తి భాగస్వామ్యం కావాలని, ఆవ శ్యకత ఎంతైనా ఉందని కృష్ణాజిల్లా సహకార అధికారి కె.చంద్రశేఖరరెడ్డి అన్నారు. సహకార రంగం ద్వారానే యువత, మహిళలు, బలహీనవర్గాల సాధికారిత సాధ్యమవుతుందన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పురిటిగడ్డ సొసైటీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పురిటిగడ్డ సొసైటీ చైర్‌పర్సన్ పెద్దిబోయిన హరినాథ్ అధ్యక్షతన జరిగిన సభలో డీసీవో మాట్లాడుతూ, 8.45లక్షల 475 సంఘాలతో 32 కోట్లకుపైగా సభ్యులతో 30 సెక్టార్లతో ఉన్నదన్నారు. మచిలీపట్నం విభాగ సహకార అధికారి వివి.ఫణికుమార్, రాష్ట్ర సహకార యూనియన్ విజయవాడ విద్యాధికారి కె.భోజరంగరాజు, చల్లపల్లి కేడీసీసీ బ్యాంకు మేనేజర్ వై.నగరాజకుమారి, అవనిగడ్డ సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ అధికారి డి.నాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహమ్మద్ గౌస్, సొసైటీల చైర్‌పర్సన్‌లు పాల్గొన్నారు.



పురిటిగడ్డలో జరిగిన సహకార వారోత్సవాల పాల్గొన్న డీసీవో చంద్రశేఖరరెడ్డి,

వడ్డీ రాయితీ : గోపు సత్యనారాయణ

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సహకార సంఘాలకు అధ్యక్షులను నియమించామని, త్రిఫ్ట్ డిపాజిట్లపై వడ్డీ రాయితీ ఇచ్చామని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు సొసైటీ సభ్యులకు మంగళవారం రుణాలు సకాలంలో చెల్లించినందుకు 469 మందికి రూ. 5లక్షల 42వేల 335 వడ్డీ రాయితీని గోపు సత్యనారాయణ అందజేశారు. సమావేశంలో దివి మహేష్, చక్కా నాగరాజు, సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు, బోట్ల రాంబాబు, పి.రామారావు, ఈమన సత్యనారాయణ, సీహెచ్ అయ్యప్ప పాల్గొన్నారు.



డీఆర్కే ప్రసాద్‌తో లక్ష్మీకాంతం దంపతులు

స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తిదాయకం

విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం

చల్లపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ చల్లపల్లిని విశ్రాంత కలెక్టర్ బి.లక్ష్మీకాంతం దంపతులు మంగళవారం సందర్శించారు. జిల్లా కలెక్టర్ హోదాలో గతంలో స్వచ్ఛ చల్లపల్లికి సహకారం అందించిన ఆయన గ్రామాన్ని పరిశీలించేందుకు వచ్చారు. స్వచ్ఛ చల్లపల్లి రథసారథులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు లక్ష్మీకాంతం దంపతులకు స్వాగతం పలికారు. చల్లపల్లి గ్రామాన్ని పరిశీలించారు. సంపద తయారీకేంద్రాన్ని పరిశీలిచారు. స్వచ్ఛ కార్యకర్తలతో మాట్లాడి వారిని అభినందించారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకమన్నారు. కలెక్టర్‌గా లక్ష్మీకాంతం పనిచేసిన కాలంలో మేకలడొంక, శ్మశానవాటిక ప్రాంగణంలో నాటిన దేవకాంచన, కొబ్బరిచెట్లు పెరగటం చూసి సంతోషం వ్యక్తంచేశారు. మొక్కలను సంరక్షించటంపై కార్యకర్తలను అభినందించారు.

పారిశుధ్యంపై శిక్షణా తరగతులు నేటి నుంచి

పెడన రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు పారిశుధ్య నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఎ.అరుణకుమారి అన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్‌లకు చెత్త సేకరణ, చెత్తనుంచి సంపద ఎలా అనే అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. నడుపూరులోని సంపద తయారీ కేంద్రం వద్ద చెత్త సేకరణ సిబ్బందికి గురువారం ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామైక్య సంఘ సభ్యులకు, పొదుపు సంఘ లీడర్స్‌కు గ్రామాల పరిశుభ్రత, చెత్త సేకరణపై ప్రజలలో అవగాహన కలిగించేందుకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నామన్నారు.



ప్రతిభను వెలికితీసేందుకే ఆటల పోటీలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నోబుల్ కళాశాలలో జన వరి 8, 9 తేదీల్లో వివిధ పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల ప్రతి భను వెలికితీయాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా మంగళవారం కలెక్టర్ బాలాజీ పోటీల వాల్‌పోస్టర్లను ఆవి ష్కరించారు. విద్యార్థులకు చదరంగం, గణితం ఒలింపియాడ్, క్విజ్, డిబేట్, సైన్స్ ఒలింపియాడ్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు సందీప్ తెలిపారు. పురుషులు, మహిళలకు వేరు వేరుగా కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో శ్రీనాథ్, నరేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ



చోడవరం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో జెన్నీ

కొనుగోలు కేంద్రంలో రికార్డుల పరిశీలన

పెడన రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవసరాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని మండల వ్యవసాయాధికారిణి ఎస్.జెన్నీ అన్నారు. చోడవరంలోని కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో కలసి పొలాలను పరిశీలించారు. వాతావరణం అనుకూలంగా ఉన్న సమయంలోనే కోతలుకోయా లన్నారు. వర్షాలు కురిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. మండలంలో ఇప్పటి వరకు 6,466 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. యూసుఫ్, తులసి రైతులు పాల్గొన్నారు.

రుణం తీర్చేశాం..

తిరిగి మంజూరు చేయకపోవటంపై కప్తానుపాలెం డ్వాక్రా గ్రూపు సభ్యుల ఆందోళన

మోపిదేవి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణం సకాలంలో తీర్చామని, మా అప్పు తీరినట్లు ధృవీకరించి కొత్తగా రుణం ఇప్పించాలంటూ విజయ గ్రూపు సభ్యులు మంగళవారం వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పెదప్రోలు పంచాయతీ శివారు కప్తానుపాలెం గ్రామానికి చెందిన విజయ డ్వాక్రా గ్రూపు సభ్యులు 2023 జనవరిలో ఒక్కొక్కరూ రూ.75 వేలు చొప్పున స్త్రీ నిధి రుణం తీసుకున్నారు. 24 నెలలు 2025 జనవరి నాటికి ఒక్కొక్క సభ్యురాలు వడ్డీతోసహ రూ.95 వేలు చెల్లించారు. తిరిగి రుణం తీసుకునేందుకు మండల సమాఖ్య కార్యాలయానికి సభ్యులు వెళ్లగా, గతంలో రుణం తీసుకున్న నలుగురు తిరిగి చెల్లించలేదని, రుణం మంజూరు చేయమన్నారన్నారు. 2025 జనవరి నాటికి చెల్లించాల్సిన అసలు, వడ్డీ కంటే అదనంగా చెల్లించినా అప్పు ఉండటం ఏమిటంటూ గ్రామైక్య సంఘ సభ్యులు, మండల సమాఖ్య సభ్యులడిగినా సరైన సమాధానం చెప్పటం లేదంటూ మహిళలు ఆరోపించారు. నలుగురు సభ్యుల రుణాన్ని లెక్కించి అప్పు తీరినట్లు ధృవీకరించాలని ఏపీఎం డి.శ్రీనివాస్‌ను సభ్యులు కోరారు. సమావేశం ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఏపీఎం తెలిపారు.



వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన

జన గణనతోపాటు కుల గణన నిర్వహించాలి : సీపీఐ

చల్లపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జనగణనతోపాటు కులగణన నిర్వహించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు డిమాండ్ చేశారు. చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ శ్రీలతకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో దాదాపు 143 వెనుకబడిన కులాలున్నాయన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించటం వల్ల పదవులను కోల్పోయారన్నారు. కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు నక్కా శ్రీను, పెనుమత్స రాజారత్నం, అల్లూరి బాబూరావు, గోగినేని రత్తయ్య, హర్షవర్ధన్, శ్రీనివాసరావు, సిద్ధాబత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.



డీటీ శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుబ్బారాయుడికి లక్ష బిళ్వార్చన, సహస్ర దీపోత్సవం

మోపిదేవి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ, తీర్థపు బిందె, గణపతి పూజ, స్వామివారికి పంచామృతాలు, పండ్ల రసాలతో, 108 కిలోల విభూదితో భస్మాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారి బిళ్వార్చనలో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

సహస్ర దీపోత్సవం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సహస్ర దీపోత్సవమంగళవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. లోకకల్యాణార్థం నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు దంపతులచే అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.





పృథ్వీశ్వరస్వామిని దర్శించుకున్న ఉన్నతాధికారులు

చల్లపల్లి: ప్రాచీన శైవక్షేత్రం నడకుదురు శ్రీపృథ్వీశ్వరస్వామి వారి ఆలయాన్ని పలువురు ఉన్నతాధికారులు మంగళవారం దర్శించుకున్నారు. జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీఏ) ఎన్.పద్మావతి, డీసీవో కె.చంద్రశేఖరరెడ్డిలతోపాటు పలువురు ప్రముఖులు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి, అమ్మవారికి పూజలు చేశారు. పాటలీవనంలో ప్రదక్షిణలు చేసి క్షేత్ర ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. జేడీఏతోపాటు ఏడీఏ ఎన్.మణిధర్, మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల, జేడీఏ కార్యాలయ ఏవోలు(టెక్నికల్) శాంత, హారిక, చల్లపల్లి ఏవో కె.మురళీకృష్ణ తదితరులున్నారు.

భావి తరాలకు సాహితీ సంపదను అందించాలి

ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు సుబ్బారావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భావి తరాలకు విలువైన సాహితీ సంపదను అందించాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం భావతరంగిణి ఆధ్వర్యంలో జరిగిన సాహిత్య సభలో గుత్తికొండ సుబ్బారావు సాహిత్య సంస్థల నిర్వహణ అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో హాస్యలహరి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య, ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజులు, ఉపాధ్యాయుడు దండిభొట్ల దత్తాత్రేయ శర్మ, భావతరంగిని సంస్థ అధ్యక్షుడు భవిష్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో గుత్తికొండ సుబ్బారావు

చిత్రలేఖనం పోటీలు

పెడన:జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పెడన శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల మల్లికార్జునప్రసాద్, కొసనం లోకనాథం, గ్రంథాలయాధికారి షేక్ కాలేషా పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గూడూరు పీహెచ్‌సీ డైరెక్టర్ గొరిపర్తి ఫణిరాజు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి నూర్ అహమ్మద్ బేగ్, గోపీ నాగబాబు, నాగరవి పాల్గొన్నారు.

మ్యూజికల్ చైర్స్

చల్లపల్లి: చల్లపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.గణేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల వనసమారాధన

నాగాయలంక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియుల అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి కార్తీక వనభోజనాలు నాగాయలంకలోని శ్రీరామపాద పుష్కరఘాట్ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఔత్సాహిక రంగ స్థల నటులు, పౌరాణిక పద్యాలను పాడి వీక్షకులను రంజింపచేశారు. అగ్నికుల క్షత్రియులు నేతలు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

నడకుదురులో అన్నదానం

చల్లపల్లి: పృథ్వీశ్వర క్షేత్రానికి మంగళవారం ఉసిరిక వనంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మల్లుపెద్ది త్రివిక్రమరావు, నాదెళ్ల వెంకట నరసయ్య, సర్పంచ్ గొరిపర్తి సురేష్ తదితరులు పర్యవేక్షించారు.



మైనర్ కిడ్నాప్‌పై కేసు

గూడూరు: యువతి మచిలీపట్నంలో జూనియర్ ఇంటర్ చదువుతోంది. సోమవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి ఆటోలో వస్తుండగా రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద కారులో వచ్చిన యువకులు కిడ్నాప్ చేశారు. యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

